

జీవీఎంసీ కమిషనర్‌కు బదిలీ?

అనకాపల్లి కలెక్టర్‌గా పోస్టింగ్ ఇస్తారని ఊహాగానాలు

- ఈ క్రమంలోనే అదనపు కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి విశ్వనాథన్ నియామకం
- జీవీఎంసీలో సర్వత్రా చర్చ

- 6వ పేజీలో


సాయికాంత్‌వర్మ

వైసీపీ కేడర్‌లో అసంతృప్తి సెగలు

పార్టీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లయినా తమకు ఒనగూరిందేమీ లేదంటూ ఆగ్రహం

స్థానిక నాయకత్వంపై తీవ్ర అసహనం


సంగివలస సభ (ఫైల్ ఫొటో)

- సభలు, సమావేశాలకు హాజరవ్వడం తప్ప ఇల్లు కూడా పొందలేకపోయానని వాపోయిన ఒక కార్యకర్త
- తమ ఎమ్మెల్యేలు ఓడిపోతారంటూ వ్యాఖ్యలు
- ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోవడం, రోడ్లు బాగుండకపోవడం పార్టీకి మైనస్ అవుతుందన్న 'చోడవరం' కార్యకర్త
- 'నెల్లిమర్ల', 'చోడవరం' నియోజకవర్గాల్లో కష్టమే
- బేబీ నాయనకు 'శంబంగి' ఎదురు నిలవలేరన్న 'బొబ్బిలి' కార్యకర్త
- షర్మిల వల్ల నష్టపోతామనే అంచనాలో కార్యకర్తలు

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): **వైసీపీ నేతల తీరుపై సామాన్య పౌరుల్లోనే కాదు... ఆ పార్టీ కేడర్‌లోనూ అసంతృప్తి నెలకొని ఉంది. పార్టీ అధికారంలోకి వచ్చినా అధినేత జగన్మోహన్‌రెడ్డి గానీ, స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలు గానీ తమకు ఏమీ చేయలేదన్న భావన మెజారిటీ కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. కొన్ని నియోజక వర్గాల్లో స్థానిక నాయకత్వంపై పార్టీ శ్రేణులు ఆగ్రహంతో ఉండడం కనిపించింది.**


రెండు రోజుల క్రితం భీమిలి నియోజకవర్గ పరిధిలోని సంగివలసలో నిర్వహించిన సభకు హాజరైన కార్యకర్తలను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు కదిలించినప్పుడు...తమలో దాగి ఉన్న అసంతృప్తిని బయట పెట్టారు. కొంతమంది సీఎం జగన్మోహన్‌రెడ్డి తీరు పట్ల అసహనం వ్యక్తం చేస్తుండగా, మరికొంతమంది తమ ఎమ్మెల్యేలపై అసంతృప్తితో ఉన్నారు. విజయనగరం జిల్లా నెల్లిమర్లలో సిట్టింగ్ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అయితే ఈసారి ఓడిపోవడం ఖాయమని ఆ నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అక్కడ ప్రతిపక్షాలు సరైన అభ్యర్థిని బరిలోకి దింపితే విజయావకాశాలు పుష్కలంగా ఉంటాయని నియోజకవర్గానికి చెందిన శ్రీరాములు అనే కార్యకర్త అభిప్రాయపడ్డారు. అప్పలనాయుడు అయితే ఈసారి తప్పనిసరిగా ఓడిపోతాడంటూ మరో కార్యకర్త పేర్కొన్నారు. టీడీపీ అభ్యర్థికి పతివాడ నారాయణస్వామి నాయుడు సహకరిస్తే అక్కడ గెలుపు ప్రతిపక్షాలకు సులభం అవుతుందని మరో కార్యకర్త పేర్కొన్నారు.

అనకాపల్లి జిల్లా చోడవరంలో ప్రస్తుతం గట్టి పోటీ నెలకొందని ఆ నియోజకవర్గానికి చెందిన ఒక కార్యకర్త వెల్లడించారు. ప్రస్తుతం సమంగా ఉన్నట్టు కనిపిస్తోందని, ఈ పరిస్థితి మారిపోయే చాన్స్ ఉందని జోగినాయుడు అనే మరో కార్యకర్త తెలిపారు. చోడవరంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ధర్మశ్రీ గెలిచే అవకాశాలు దాదాపు లేవని మరో కార్యకర్త తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఇక్కడ వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు మంచి అవకాశం ఉందని రామారావు అనే కార్యకర్త చెప్పారు. ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేక పోవడం, రోడ్లు బాగుండకపోవడం స్థానికంగా పార్టీకి మైనస్‌గా ఉందని మరో కార్యకర్త వాపోయారు. జగన్ వరకూ పర్వాలేదని, స్థానికంగా ఎమ్మెల్యే పనితీరు ఆశాజనకంగా లేదంటూ అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నుంచి వచ్చిన కార్యకర్త అన్నారు.

విజయనగరం జిల్లా బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చినవెంకట అప్పలనాయుడుకు క్లిష్ట పరిస్థితులు కనిపిస్తున్నాయని, తెలుగుదేశం నాయకుడు బేబీ నాయన ప్రజల్లోకి దూసుకువెళుతూ ఆదరణ పొందుతున్నారంటూ ఆ నియోజకవర్గానికి చెందిన కృష్ణ అనే కార్యకర్త పేర్కొన్నారు. బొబ్బిలి నుంచి సమావేశానికి ... మిగతా 6వ పేజీలో

పేదల భూములపై పెద్దల కన్ను

ఆనందపురం మండలంలో డి.పట్టా భూములు కొనుగోలు



ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా 500 ఎకరాలు టార్గెట్

- 200 ఎకరాలు తీసుకునేందుకు సిద్ధమైన సీనియర్ ఐఏఎస్ అధికారి
- మిగిలిన 300 ఎకరాలు వైసీపీ నేతలకు...
- 22 ఏ జాబితా నుంచి తొలగిస్తున్న అధికారులు
- బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): **ప్రభుత్వంలో కీలకపాత్ర పోషిస్తున్న ఒక ఉన్నతాధికారితో పాటు మరికొందరు కలిసి నగర శివారునున్న ఆనందపురం మండలం గండిగుండం, వేములవలస ప్రాంతాల్లో బినామీల పేరుతో డీపట్టా భూములు కొనుగోలు చేస్తున్నట్టు తెలిసింది. మొత్తం 500 ఎకరాల వరకూ సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని, ఇప్పటికే 150 ఎకరాల మేర లావాదేవీలు పూర్తయ్యాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెబుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా ఈ భూముల కొనుగోళ్ల ప్రక్రియ పూర్తిచేయాలని నిర్ణయించినట్టు ప్రచారం సాగుతుంది.**

రాష్ట్రంలో దళిత, వెనుకబడిన వర్గాలకు జీవనోపాధి కోసం 1970 తరువాత ప్రభుత్వం ఎకరా నుంచి ఐదెకరాల వరకూ పంపిణీ చేసింది. ఈ విధంగా విశాఖ నగర శివారు ప్రాంతాలైన ఆనందపురం, భీమిలి, పెందుర్తి, పద్మనాభం, సబ్బవరం మండలాల్లో వేలాది మందికి అప్పట్లో పట్టాలు ఇచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో వ్యవసాయం చేసుకోవడం ద్వారా రైతులు తమ కుటుంబాలను పోషించుకోవాలి. ఎవరికీ విక్రయించకూడదు. అయితే చాలామంది కుటుంబ అవసరాల కోసం అమ్మేసుకున్నారు. పేదల నుంచి నిబంధనలకు విరుద్ధంగా కారుచౌకగా డీపట్టా భూములను దక్కించుకున్న కొనుగోలుదారులు తమ పలుకుబడి ఉపయోగించి రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేయించుకుని, పట్టాదారు పాస్ పుస్తకాలు పొందారు. ఇలా నగరం, చుట్టుపక్కల ప్రధాన రహదారులకు ఆనుకుని కొన్ని డీపట్టా భూములు చేతులు మారిపోయాయని రెవెన్యూ అధికారులే చెబుతున్నారు.

ఇక 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పార్టీ పెద్దలు, కొంతమంది ఉన్నతాధికారులు...డీపట్టా భూములపై కన్నేశారు. ఈ క్రమంలోనే క్రయవిక్రయాలకు అనుమతిస్తూ జీవో విడుదల చేశారు. దీని ప్రకారం ఇప్పటివరకూ (20 ఏళ్లు దాటినవి) చేతులుమారని డీపట్టా భూములు సదరు పట్టాదారుడికి దఖలు పడేలా కన్వేయన్స్ డీడ్ జారీచేయాలని నిర్ణయించారు. ఆ తరువాత ఆ భూములను అధికారికంగా విక్రయించుకునే వెసులుబాటు కల్పించారు. ఆ జీవో విడుదలకు ముందే (ఏడాది కిందట నుంచి) వైసీపీ నేతలు, కొందరు ఉన్నతాధికారులు విశాఖ పరిసరాల్లో డీపట్టా భూములు కొనుగోలుకు బేరసారాలు సాగిస్తున్నారు. పెందుర్తి, ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల్లో డీపట్టా భూముల కొనుగోలుకు కొందరు బినామీలను రంగంలోకి దించారు. ఇప్పటికీ చేతులు మారని పట్టా భూముల రైతులతో సంప్రతింపులు జరిపారు. ఈ విధంగా ప్రభుత్వంలో కీలకమైన పోస్టులో ఉన్న సీనియర్ ఐఏఎస్‌తో పాటు మధ్య కోస్తాకు చెందిన మంత్రి ఒకరు, మరికొందరు వైసీపీ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు డీపట్టా భూములు భారీగా కొనుగోలు చేశారు. ఆనందపురం మండలం గండిగుండం ... మిగతా 6వ పేజీలో

నిజాయితీకి బదిలీ బహుమానం!

జాయింట్ కలెక్టర్ బదిలీపై రెవెన్యూలో కలకలం

- మూడేళ్లు కాకుండానే స్థానచలనం
- పాలక పెద్దలు చెప్పినట్టల్లా ఆడలేదనే...
- డి.పట్టా భూములకు కన్వేయన్స్ డీడ్ జారీలో నిక్కచ్చిగా వ్యవహరించిన విశ్వనాథన్
- భీమిలిలో ఓ సంస్థకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని ఇతర అవసరాలకు వినియోగించుకునేందుకు అంగీకరించని వైనం
- అందుకే తప్పించారని ప్రచారం


కేఎస్ విశ్వనాథన్

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): **విధి నిర్వహణలో ముక్కుసూటిగా వ్యవహరించే జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్‌ను...పాలక పెద్దలు తమ మాట వినడం లేదనే అప్రాధాన్య పోస్టులోకి పంపారనే ప్రచారం రెవెన్యూ వర్గాల్లో జరుగుతోంది. నగర శివారుల్లో ముఖ్యంగా భీమిలి, ఆనందపురం మండలాల్లో భూముల విషయంలో అధికార పార్టీ నేతలు, ఉన్నతాధికారులు చెప్పినచోటల్లా సంతకం చేయకపోవడమే బదిలీకి కారణంగా తెలుస్తోంది.**

ప్రభుత్వానికి సన్నిహితంగా ఉండే వ్యక్తికి భీమిలి మండలంలో భూమిని కేటాయించడం జరిగింది. దానిని ఆయన సొంత అవసరాలకు వినియోగించుకోవాలని చూడగా...జేసీ అభ్యంతరం తెలిపినట్టు సమాచారం. నిబంధనల మేరకు అంటే...గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు భూ వినియోగం జరగాలని స్పష్టం చేసినట్టు చెబుతున్నారు. ఇక శివారు ప్రాంత మండలాల్లో భూవ్యవహారాలపై పట్టున్న రెవెన్యూ అధికారి ఒకరికి ఉన్నతాధికారులు, పాలక పెద్దల ఆశీస్సులు ఉన్నాయి. రెవెన్యూ అంశాలకు సంబంధించి నేరుగా జేసీకి జవాబు దారీగా ఉండాల్సిన సదరు అధికారి... ఉన్నతాధికారులు, పెద్దలు చెప్పినట్టు ఫైళ్లు చక్కబెడుతున్నారు. దీనిపై జేసీకి ఫిర్యాదులు రావడంతో సదరు అధికారి నుంచి వచ్చిన ఫైళ్లపై కన్నేశారు. అడ్డగోలుగా వచ్చిన ఫైళ్లను వెనక్కి పంపడం లేదా పక్కనపెట్టడం పాలక పెద్దలకు నచ్చలేదు. అలాగే జగనన్న కాలనీలకు భూములు ఇచ్చిన రైతులకు కేటాయించిన ప్లాట్లను దక్కించుకోవాలని అధికార పార్టీ నేతలు యత్నించారు. అయితే నిబంధనల మేరకు భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించే ప్రక్రియను జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అదేవిధంగా డీపట్టా భూములు రెగ్యులేషన్ విషయంలో కూడా విశ్వనాథన్ నిక్కచ్చిగా వ్యవహరించారు. నిబంధనల ప్రకారం 20 ఏళ్ల క్రితం డీపట్టా తీసుకున్న రైతు ఆధీనంలోనే భూమి ఉంటేనే రెగ్యులర్ చేయడానికి అనువుగా కన్వేయన్స్ డీడ్ జారీ చేస్తున్నారు. శివారు ప్రాంతంలో చేతులు మారిన డి.పట్టా భూములను రెగ్యులర్ చేయడానికి జేసీ అంగీకరించలేదు. డీపట్టా భూముల రెగ్యులర్ చేసేందుకు తహసీల్దార్లు పంపిన ప్రతిపాదనల్లో ర్యాండమ్‌గా జేసీ పరిశీలిస్తే సరిపోతుంది. కానీ విశ్వనాథన్ ప్రతి ఫైలును చూసి స్వయంగా క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకుంటున్నారు. గతంలో డీపట్టా భూములను కొనుగోలు చేసిన పెద్దలకు జేసీ తీరు ఇబ్బందికరంగా మారింది. అందువల్ల జేసీని తప్పిస్తే తప్ప గతంలో తాము కొనుగోలు చేసిన డీపట్టా భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోలేమనే నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే విశ్వనాథన్‌ను బయటకు పంపారని రెవెన్యూ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతుంది. ఆయన్ను బదిలీ చేయడానికి చాలా రోజులుగా చూస్తున్న ప్రభుత్వానికి ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలు వరంగా మారాయి. రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులతో పాటు ... మిగతా 6వ పేజీలో

విశాఖ రేంజ్ డీఐజీగా విశాల్ గున్ని

- విశాఖ సిటీ జాయింట్ పోలీస్ కమిషనర్‌గా ఫకీరప్ప
- డీసీపీ-1గా మణికంఠ చందోల్
- డీసీపీ-2గా ఎం.సత్యనారాయణ
- ఆనందరెడ్డి విజయవాడ బదిలీ


విశాల్ గున్నీ


హరికృష్ణ


ఫకీరప్ప


మణికంఠ చందోల్


ఎం.సత్యనారాయణ

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ సోమవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇటీవల పదోన్నతి పొందిన విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణను ఐజీ పర్సనల్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఆయన స్థానంలో విజయవాడ డీసీపీగా పనిచేస్తున్న విశాల్ గున్నీని నియమించారు. ఇక గత కొంతకాలంగా ఖాళీగా ఉన్న నగర జాయింట్ పోలీస్ కమిషనర్ పోస్టులో కె.ఫకీరప్పను నియమించింది. డీసీపీ-1గా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావును జగ్గయ్యపేట డీసీపీగా బదిలీ చేసి, ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా స్పెషల్ ... మిగతా 6వ పేజీలో

ఫిల్మ్ క్లబ్‌లో లుకలుకలు

రెండేళ్ల క్రితం తమ చేతుల్లోకి తీసుకున్న వైసీపీ నేతలు



ఫిల్మ్‌క్లబ్

- భోగాపురం వద్ద ప్రభుత్వంతో 15 ఎకరాలు మంజూరు చేయిస్తామని హామీలు
- ఇప్పటివరకూ అతీగతి లేదు
- సభ్యుల నుంచి వసూలు చేసిన రూ.30 కోట్లతో భీమిలి వద్ద ప్రైవేటు భూమి కొనుగోలుకు సన్నాహాలు
- కమిటీ అధ్యక్షునిగా ఉన్న కాయల వెంకటరెడ్డికి రియల్ ఎస్టేట్‌పరంగా లాభం చేకూర్చేందుకేనని ఆరోపణలు
- నేడు ఏజీఎం...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) **వైజాగ్ ఫిల్మ్ క్లబ్‌లో విభేదాలు ముదిరిపోయాయి. క్లబ్‌ను వైసీపీ నేతల ప్రతినిధులు వారి చేతుల్లోకి తీసుకున్న సంగతి తెలిసిందే. సభ్యత్వం ద్వారా వచ్చిన రూ.30 కోట్ల నిధులను ఇప్పుడు ఇష్టానుసారం ఖర్చు చేయడానికి యత్నించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం క్లబ్ వార్షిక సాధారణ సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో భూమి కొనుగోలుకు నిర్ణయం తీసుకుంటారని విశ్వసనీయ సమాచారం.**

వాల్తేరు క్లబ్‌పై ఆధిపత్యం చెలాయించడం కుదరదని తేలిపోయాక వైసీపీ 'పెద్దలు'...ఫిల్మ్ నగర్ క్లబ్‌పై కన్ను వేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం నుంచి భూమి ఇప్పిస్తామని ఆశ చూపించి రెండేళ్ల క్రితం కార్యవర్గాన్ని పూర్తిగా మార్చేశారు. బైలాను కూడా వారికి అనుకూలంగా మార్చుకున్నారు. శాశ్వతంగా ఉండేలా ఒక కోర్ కమిటీని పెట్టుకున్నారు.

భూ కేటాయింపు వివాదం

మొదట తొట్లకొండ వద్ద ప్రభుత్వం 17 ఎకరాలు కేటాయించింది. అది కోర్టు వివాదంలో చిక్కుకుంది. దాంతో తెలుగుదేశం ప్రభుత్వం రామానాయుడు స్టూడియో వద్ద ఈ క్లబ్‌కు ఐదు ఎకరాలు (జీఓ నంబరు 234) కేటాయించింది. దానికి రూ.22.5 లక్షలు చెల్లించారు. దానిని స్వాధీనం చేసుకోవడం ఎన్నికల కారణంగా జాప్యం జరిగింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ నేతలు ఆ క్లబ్‌ను తమ చేతుల్లోకి తీసుకున్నారు. రామానాయుడు స్టూడియో దగ్గర కాకుండా ప్రభుత్వం నుంచి భోగాపురం విమానాశ్రయం దగ్గర 15 ఎకరాలు ఇప్పిస్తామని ప్రకటించారు. ఈలోగా సభ్యత్వాలు పెంచారు. ఇప్పుడు 1,395 మంది ఉన్నారు. వీరి నుంచి సభ్యత్వ రుసుముగా రూ.33 కోట్లు వరకూ వచ్చింది. ఈ మొత్తాన్ని ఈస్ట్ పాయింట్ కాలనీలోని యుబీఐ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. కొద్దికాలం క్రితం ఈ నిధులను మద్దిలపాలెంలో మరో బ్యాంకుకు బదిలీ చేశారు. ప్రస్తుత కమిటీ పదవీ కాలం వచ్చే నెలలో ముగిసిపోనుంది. భోగాపురంలో దగ్గర 15 ఎకరాల కేటాయింపు విషయం ఏమైందో చెప్పడం లేదు. ఇప్పుడు భీమిలిలో ప్రైవేటు స్థలం ఐదు ఎకరాలు కొనాలని చూస్తున్నారు. అది ప్రస్తుతం కమిటీ అధ్యక్షుడిగా ఉన్న కాయల వెంకటరెడ్డి రియల్ ఎస్టేట్ వెంచర్‌కు సమీపంలో గల భూమి అని పలువురు చెబుతున్నారు. ఆయన అక్కడ సుమారు 25 నుంచి 30 ఎకరాలు తక్కువ ధరకు కొన్నారని, అందులో ఐదు ... మిగతా 6వ పేజీలో

విద్యుత్ చార్జీలు పెంచబోం


సీఎండీ పృథ్వీతేజ్

- ఈ ఆర్థిక సంవత్సరం భారం మోపబోం
- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్
- 2024-25 ఆదాయ అంచనాలు రూ.21,162 కోట్లు
- ప్రతిపాదిత ధరల రాబడి రూ.100.44 కోట్లు
- ఒక్క రైల్వే ట్రాక్షన్ చార్జీలు యూనిట్‌కు రూపాయి పెంపునకు ప్రతిపాదన

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులపై ఈ (2024-25) ఆర్థిక సంవత్సరంలో ఎటువంటి భారం మోపడం లేదని, చార్జీలు పెంచడం లేదని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడించారు. విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో ఏపీఈఆర్‌సీ సోమవారం నిర్వహించిన టారిఫ్ ప్రతిపాదనల స్వీకరణ, ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని డిస్కమ్ ప్రగతిని, ప్రతిపాదనలు వివరించారు.

కేవలం రైల్వే ట్రాక్షన్ చార్జీలను మాత్రం యూనిట్‌కు రూపాయి పెంచడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. నాలుగేళ్ల నుంచి యూనిట్‌కు రూ.5.50 మాత్రమే వసూలు చేస్తున్నామని, సర్వీసు ధర 40 శాతం పెరిగిందని, ఈ నేపథ్యంలో పెంపు అనివార్యమన్నారు. దీనివల్ల డిస్కమ్‌కు అదనంగా రూ.100.24 కోట్లు సమకూరుతుందన్నారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్లను ఓల్టేజ్ సర్వీసు వ్యయంతో టారిఫ్‌కు లింకు ... మిగతా 6వ పేజీలో

నగరానికి ఎనిమిది మంది సీఐలు

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్‌లో ఉన్న ఎనిమిది మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను సిటీకి కేటాయిస్తూ ఐజీ హరికృష్ణ ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో సీనియర్ అధికారులు ఎ.పార్థసారధి, జి.గోవిందరావుతోపాటు వారం క్రితం పదోన్నతి పొందిన కల్లూరి శ్రీనివాసరావు, ఊయక రమేష్, గుబ్బల శ్రీనివాసరావు, అమిత ప్రసాదరావు, గొల్లు అర్జున్, ఎల్. రామకృష్ణ ఉన్నారు. వీరందరికీ నగర పోలీస్ కమిషనర్ పోస్టింగ్స్ ఇవ్వనున్నారు.


కోటవీధి వద్ద పోర్టు కెనాల్‌లో మురుగునీరు


కాలువ వద్ద నిలిచిన మురుగు

పోర్టు కెనాల్ దుర్గంధంతో ఉక్కిరిబిక్కిరి

- కోటవీధి వద్ద నిలిచిన మురుగునీరు, చెత్తాచెదారాలు
- వన్‌టౌన్ పరిధిలో ఆరునెలలుగా నరకయాతన
- దోమలు స్వైర విహారం.. ప్రబలుతున్న వ్యాధులు
- పట్టించుకోని పోర్టు ట్రస్ట్.. జీవీఎంసీ


స్కీమ్ బిల్డింగ్ నివాసితుల ఇళ్ల ఎదుట దుస్థితి..

జగదాంబ కూడలి, జనవరి 29: పోర్టు కెనాల్‌లో మురుగునీటితో పాతనగర ప్రాంత నివాసితులు రోగాల పాలవుతున్నారు. నిత్యం దుర్గంధంతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. పోర్టుకెనాల్‌తో ఆరు నెలలకుపైగా వన్‌టౌన్‌లోని లక్ష్మీటాకీస్, ఫెర్రీ రోడ్డు స్కీం బిల్డింగ్, పోస్టాఫీసు పరిసర ప్రాంతాల్లోని జనాలు నరకయాతన అనుభవిస్తున్నారు. సమస్య పరిష్కరించాల్సిన జీవీఎంసీ, పోర్టు ట్రస్ట్ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్రఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పోర్టు ట్రస్ట్ అధికారులు ఇక్కడఉన్న పెద్ద గొట్టాలకు టింకరింగ్ పనులు చేపడుతుండడంతో కెనాల్‌లో చెత్తాచెదారాలు, పూడిక పేరుకుపోయి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పోర్టు కెనాల్ డ్రైనేజీ ద్వారా కేజీహెచ్ డౌనునుంచి కొబ్బరితోట, జ్ఞానాపురంనుంచి పోర్టుట్రస్ట్ కోట వీధి, ఫెర్రీరోడ్డు నుంచి మురుగు నీటిని సముద్రంలోకి విడిచిపెతున్నారు. పోర్టు కన్వేయర్ బెల్ట్ నుంచి వెంకటేశ్వర స్వామి గుడికివెళ్లేదారిలో పోర్టు కెనాల్ వద్ద పోర్టు ట్రస్ట్ బ్రిడ్జి నిర్మాణ పనులతో మురుగునీరు కోటవీధి వద్ద కాలువల్లో పూడిక పేరుకుపోయింది. నీటి నిల్వలతో దోమల వృద్ధితో నిద్ర కరువవుతోందని పరిసరాల వాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఒకవైపు పోర్టు కాలుష్యం.. మరోపక్క పోర్టు కెనాల్ దుర్గంధంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వ్యాధులు ప్రబలుతున్నాయి. పిల్లలు పరిస్థితి మరింత దారుణంగా మారిందని ఫెర్రీ రోడ్డులో నివాసముంటున్న కుటుంబాలు ఆవేదన చెందుతున్నారు డెంగీ, మలేరియా, శ్వాసకోస వ్యాధులతో ఇబ్బంది ఎదుర్కోవాల్సి వాపోతున్నారు. ఐదారునెలల కిందట భారీ తుఫాన్‌తో పోర్టు కెనాల్ అస్తవ్యస్తంగా మారి ఇళ్లలోకి నీరు రావడంతో పాతపోస్టాఫీసు, ఫెర్రీ రోడ్డు, లక్ష్మీటాకీస్ నివాసితులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ వెంటనే పర్యటించి పోర్టు కెనాల్‌లో పూడికలను తీయించారు. ఈ చెత్తాచెదారాలను రహదారులపైనుంచి ఇప్పటికీ తొలగించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోర్టు కెనాల్ దుర్గంధంనుంచి కాపాడాలంటూ కమిషనర్ సాయికాంత్ వర్మ, కలెక్టర్ మల్లికార్జున, పోర్టు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అంగముత్తులకు పలుమార్లు వినతులు సమర్పించినా పట్టించుకోలేదని స్థానిక టీడీపీ మైనారిటీ నాయకుడు గఫూర్ (లడ్డా) ఆరోపిస్తున్నారు. పోర్టు కెనాల్ జీవీఎంసీ పరిధిలోకి రాదంటూ సంబంధిత అధికారులు, పోర్టు అధికారులను అడిగితే జీవీఎంసీదే బాధ్యత అంటూ తప్పించుకుంటున్నారని ఆయన వాపోతున్నారు. స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ తుపాన్ వస్తే తప్ప ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆయన విమర్శించారు. ఇకనైనా తక్షణం అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పరీక్ష పే చర్చా కార్యక్రమం వీక్షణ


ఆర్పీపేట పాఠశాలలో వీక్షిస్తున్న విద్యార్థులు

కంచరపాలెం, జనవరి 29 : పరీక్షా పే చర్చా కార్యక్రమం ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ సందేశాన్ని సోమవారం జీవీఎంసీ పాఠశాలల్లోని విద్యార్థులు వీక్షించారు. ఆర్పీపేట, కంచరపాలెం, కప్పరాడ, మాధవధార తదితర పాఠశాలల్లో ఐఎఫ్‌పీ ప్యానల్స్ ద్వారా ప్రధాని సందేశాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు చూశారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు సన్నద్ధమ య్యేలా విద్యార్థులు తెలుసుకున్నారు. ఆర్పీపేట ఉన్నత పాఠశాల్లో హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశాన్ని వివరించారు. ప్రధాని మోదీ చేసిన 25 సూచనలను తెలిపారు.

వేటూరి గీతాలతో సంగీత విభావరి నేడు

డాబాగార్డెన్స్, జనవరి 29: ప్రముఖ సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి 88వ జయంతి సందర్భంగా ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 30న డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'ఎదలో మోహన లాహిరి' పేరిట వేటూరి విరచిత చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు ఆత్రేయ స్మారక కళాపీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళీ తెలిపారు. ఈ సందర్భంగా సినీ నేపథ్య గాయని గాలిదేవర సాహితీకి వేటూరి యువ గాయని పురస్కారంతో సత్కరిస్తున్నట్లు తెలిపారు. ఇందులో సినీ గాయని సాహితీ, రమేశ్ పట్నాయక్, శంబర జోగారావు, బాల గణేశ్, హారిక శ్రీకాకుళం, హారిక విజయనగరం, లీపికారెడ్డి తదితరులు వేటూరి పాటలను పాడనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సినీ, రాజకీయ , కళా రంగ ప్రముఖులు పాల్గొననున్నట్లు చెప్పారు.

వైసీపీ కేడర్‌లో అసంతృప్తి సెగలు

... 5వ పేజీ తరువాయి

వచ్చిన సదరు కార్యకర్త.. శంబంగి మంచివాడైనప్పటికీ బేబీ నాయనను తట్టుకోలేరని, ఓడిపోయే చాన్స్ ఉందంటూ విశ్లేషించారు. ఇక్కడ నుంచి జడ్పీ చైర్మన్ చిన్న శ్రీనును బరిలోకి దించితే కొంతవరకూ పోటీ ఇచ్చే అవకాశం ఉందని అభిప్రాయ పడ్డారు. ఇలా... మరికొన్ని నియోజకవర్గాల నుంచి వచ్చిన వైసీపీ కార్యకర్తలు కూడా స్థానిక ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్లలో తమకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదని వాపోయారు. పార్టీ సమావేశాలకు, సభలకు రావడం తప్ప...కనీసం ఇల్లు కూడా పొందలేక పోయామంటూ నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన ఒక కార్యకర్త వాపోయారు. గ్రామ/మండల స్థాయిల్లో స్థానిక నేతల వ్యవహారశైలి వల్లే పార్టీపై వ్యతిరేకత పెరిగిందన్నారు.

షర్మిల ప్రభావంపై చర్చ

సభా ప్రాంగణంలో వైసీపీ కార్యకర్తలు షర్మిల ప్రభావంపైనా చర్చించుకుంటూ కనిపించారు. ఈసారి షర్మిల వల్ల కొంత ఓట్లు నష్టపోతామని కొందరు విశ్లేషించారు. షర్మిల చేస్తున్న తీవ్ర విమర్శలు పార్టీకి దెబ్బేనని ఆందోళన వ్యక్తంచేశారు. షర్మిలకు జగన్ ఏదో ఒక పదవి ఇచ్చేస్తే సరిపోయేదని, అలా చేయకుండా సమస్యను పెంచుకున్నా డంటూ పలువురు కార్యకర్తలు విశ్లేషించారు.

పేదల భూములపై పెద్దల కన్ను

... 5వ పేజీ తరువాయి

గ్రామంలో సుమారు 50 ఎకరాలను వైసీపీకి చెందిన నేత ఒకరు ఇటీవల కొనుగోలు చేశారు. ఆ భూముల్లో కొబ్బరిమొక్కలు నాటారు. రాష్ట్రంలో ప్రముఖుని కోసం ఈ భూములు కొనుగోలు చేసినట్టు తెలిసింది. ఇంకా పొరుగు జిల్లాలో చక్రం తిప్పుతున్న మరో కీలక నేత కూడా గండిగుండంలో డీపట్టా భూములు కొనుగోలు చేశారు. పొరుగు జిల్లా నేతకు ఈ ప్రాంతంలో వైసీపీ నేతలు కొందరు సాయపడ్డారు. గండిగుండంలో సర్వేనంబరు 272 నుంచి 275 వరకూ సుమారు 20 ఎకరాల మేర డీపట్టా భూములు విక్రయాలు జరిగాయి. దీనికి సంబంధించి ఆనందపురంలో రిజిస్ట్రేషన్లు జరిగాయి. పాలవలసలో డీపట్టా భూములను నగరానికి చెందిన వైసీపీ ఇన్‌చార్జి ఒకరు కొనుగోలు చేశారు.

చేతులు మారని డీపట్టా భూముల సర్వే నంబర్లను 22 'ఏ' జాబితా నుంచి జిల్లా అధికారులు తొలగించడంతో రిజిస్ట్రేషన్లు కూడా అవుతున్నాయి. అయితే అధికార పార్టీ నేతలు, కీలక అధికారులు కొనుగోలు చేసిన భూములను మాత్రమే 22 (ఎ) జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆనందపురం, పెందుర్తి, భీమిలి, పద్మనాభం మండలాల్లో సుమారు మూడు వేల ఎకరాల డీపట్టా భూములు చేతులు మారుతున్నాయి. ఇందులో 100 నుంచి 200 ఎకరాలు ఒక కీలక అధికారి తీసుకుంటున్నట్టు తెలిసింది. ఆయనకు అనుకూలంగా రిజిస్ట్రేషన్లకు ఇబ్బంది లేకుండా జిల్లా అధికారులు సహకరిస్తున్నారనే ప్రచారం సాగుతుంది.

సమస్యల పరిష్కారానికి కృషి

- మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు


మహిళలతో మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, జనవరి 29: వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. గ్రేటర్ 45వ వార్డు లక్ష్మీనారాయణపురంలో సోమవారం ఆయన పర్యటించారు. మహిళలు ఆయనకు హారతిచ్చి స్వాగతం పలికారు. ఆ ప్రాంతంలోని ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నట్టు చెప్పారు. తనకు సహకరించాలని కోరారు. ఆయనతో పాటు బీజేపీ వార్డు అధ్యక్షుడు వీరబాబు, మండల అధ్యక్షుడు పూజా ఆశీర్వాదం, నాయకులు కొప్పిశెట్టి శంకరరావు, కేవీ కుమార్ తదితరులు ఉన్నారు.

ఆంధ్రాబ్యాంక్ లోగోతో వెండి నాణెం ఆవిష్కరణ


నాణేం ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు

సీతంపేట, జనవరి 29: ఆంధ్రాబ్యాంక్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య ముఖచిత్రంతోపాటు బ్యాంక్ లోగోతో ముద్రించిన వెండి నాణెంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ డాక్టర్ పట్టాభి భోగరాజు పట్టాభిరామయ్య ఆంధ్రాబ్యాంక్, ఆంధ్రా ఇన్సూరెన్స్ కంపెనీ, కృష్ణా జిల్లా సహకార బ్యాంక్, భాగ్యలక్ష్మి బ్యాంక్‌ల వ్యవస్థాపకులుగా చిరస్మరణీయమైన సేవలందించాలన్నారు. ఈ సందర్భంగా నాణేలను విశ్రాంత ఉద్యోగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జి.వాసుదేవమూర్తి, టి.కామేశ్వరరావు, టి.సింహాచలం, టి.కృష్ణారావు, బి.బాపూజీ, ఆర్‌వి రవికుమార్, కె.కోటేశ్వరరావు, జి.మృత్యుంజయరావు, బి.హరిగోపాల్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు డీవీఎస్‌వై శర్మ

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 29: ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా యూత్ గేమ్స్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో నగరానికి చెందిన ఎల్ఐసీ ఉద్యోగి, బ్లూ బ్యాడ్జీ అంపైర్ డాక్టర్ డీవీఎస్‌వై. శర్మ ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ మేరకు శర్మను అంపైర్‌గా నియమిస్తూ భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు అనేక అంతర్జాతీయ, జాతీయ టేబుల్ టెన్నిస్ టోర్నీలకు అంపైర్‌గా వ్యవహరించిన శర్మ..చెన్నైలో జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో కూడా పాల్గొనడంపై ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదప్రసాద్ దాస్, మేనేజర్ పర్సనల్ భగవాన్ ప్రసాద్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు కామేశ్వరి, వరప్రసాద్‌తోపాటు టేబుల్ టెన్నిస్ రాష్ట్ర, జిల్లా సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.


శర్మ



సమావేశంలో పల్లా, కోండ్రు మురళీ తదితరులు


42 వార్డులో నిర్వహించిన శిక్షణలో పార్టీ శ్రేణులు

ఉత్తరాంధ్రలో వైసీపీ సింగిల్ డిజిట్‌కే పరిమితం

- మాజీ మంత్రి కోండ్రు మురళీ మోహన్

మహారాణిపేట, జనవరి 29: తెలుగుదేశం పార్టీలోకి పలు వైసీపీకి చెందిన కార్యకర్తలు చేరారు. సోమవారం టీడీపీ కార్యాలయం లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ ఆధ్వర్యంలో విశాఖలో స్థిరపడిన రాజాం నియోజకవర్గానికి చెందిన 60 కుటుంబాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కోండ్రు మురళీ మాట్లాడుతూ, రాష్ట్రంలో త్వరలో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలా ఆడనుందన్నారు. ప్రతీ నియోజకవర్గంలో వైసీపీనుంచి పలువురు టీడీపీలో చేరుతున్నారన్నారు. వైసీపీ పాలనలో నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ముఖ్యమంత్రి జగన్ రాజధాని పేరిట నాటకాలు ఆడుతూ ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈస్థితిలో రానున్న ఎన్నికలలో ఉత్తరాంధ్ర పరిధిలో ఉన్న 34 నియోజకవర్గాలలో టీడీపీ జండా ఎగురవేస్తామన్నారు. అధికార వైసీపీకి సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని తెలిపారు. పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ టీడీపీపై ప్రజలు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేనలు ఉమ్మడి విజయం ఖాయమన్నారు. ఈ సమావేశంలో సౌత్ గండిబాబ్జీతోపాటు పలువురు నాయకుల కార్యకర్తలు పాల్గొన్నారు.

42వ వార్డులో ఇంటిగ్రేటెడ్ శిక్షణ

అక్కయ్యపాలెం: మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని టీడీపీ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విశాఖపట్నం ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకిరెడ్డి జగదీష్ హాజరయ్యారు. ఇంటిగ్రేటెడ్ ట్రైనర్ గౌస్, వినయ్ బూత్ ప్రెసిడెంట్లకు ఓటర్ వెరిఫికేషన్, భవిష్యత్ గ్యారెంటీ తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కన్నం వెంకటరమణారావు, ముక్కి రామకృష్ణ, నాయకులు శ్రీకృష్ణ, దువ్వి కాశీప్రసాద్, కందుకూరి శ్రీవేణి, బంగారు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థులు హవా


అర్హతసాధించిన విద్యార్థులు పాఠశాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు

మహారాణిపేట, జనవరి 29: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఏపీటీ) ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ సైన్స్ ఒలింపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థులు హవా చాటారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి 45 మంది విద్యార్థులు ఎంపిక కాగా, వీరిలో ఒక్క విశాఖ జోన్ నుంచి 29 మంది శ్రీ చైతన్య స్కూల్‌నుంచి విజయకేతనం ఎగురవేశారు. వీరంతా ఫిబ్రవరిలో ఇండియన్ నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ పాల్గొననున్నారు. అర్హత సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను ఉత్తరాంధ్ర శ్రీచైతన్య సంస్థల ఇన్‌చార్జి ఎంవీ సురేశ్, రీజనల్ ఇన్‌చార్జి ఎండీ అహ్మద్ అలీ, తదితరులు అభినందించారు.

కిరండోల్ రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్

విశాఖపట్నం, జనవరి 29: ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ, కిరండోల్ మధ్య రాకపోకలు సాగించే రైళ్లకు ఫిబ్రవరి రెండో తేదీ నుంచి అదనంగా ఒక విస్టాడోమ్ కోచ్‌ను జత చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ-కిరండోల్ రైలుకు (08551) ఫిబ్రవరి రెండు నుంచి మార్చి 31వ తేదీ వరకు ప్రతి శుక్ర, శని, ఆదివారం, తిరుగు ప్రయాణంలో కిరండోల్-విశాఖ రైలుకు (08552) ఫిబ్రవరి మూడు నుంచి ఏప్రిల్ ఒకటి వరకు ప్రతి శని, ఆది, సోమవారాల్లో ఈ కోచ్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

నేడు మాంసం దుకాణాలకు సెలవు

వెంకోజీపాలెం, జనవరి 29 : మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం జీవీఎంసీ పరిధిలోని మాంసం, చేపల దుకాణాలు మూసివేయాలని కమిషనర్ సాయికాంత్ వర్మ సోమవారం ఓ ప్రకటనలోఆదేశాలు జారీ చేశారు. వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే రూ.500 నుంచి రూ.5000 వరకు జరిమానా విధించడంతో పాటు వ్యాపార లైసెన్సు, పట్టుబడిన మాంసాన్ని సీజ్ చేస్తామని చెప్పారు.

గుంతల పూడ్చివేతకు చర్యలు

జ్ఞానాపురం, జనవరి 29: జీవీఎంసీ 41వ వార్డులో నిరంతర నీటి సరఫరా కోసం తవ్విన గుంతలతో కొద్దిరోజులుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగిపోనున్నాయి. ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీలో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఈ సమస్య లేవనెన్నారు. దీంతో నిధులు మంజూరుకావడంతో సోమవారం నుంచి జ్ఞానాపురం ప్రాంతంలో గుంతల పూడ్చివేతకు చర్యలు చేపట్టారు.ఈ పనులకు వార్డు క్లస్టర్ ఇన్‌చార్జ్ కోడిగుడ్ల శ్రీధర్ పరిశీలించారు. కార్యక్రమంలో వెలంగణిరావు, శ్యామ్‌సుందర్, రమేష్, కళ్యాణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

సీతంపేట, జనవరి 29: గాలి, నీరు, భూమి విషతుల్యం కాకుండా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆంధ్రా యూనివర్శిటీ ఎన్విరానిమెంటల్ సైన్స్ ప్రొఫెసర్ ఇ.ఉదయ్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గ్రీన్ క్లైమేట్ టీ ఆధ్వర్యంలో ఎన్జీవోలు ముద్రించిన పర్యావరణ పరిరక్షణ రోజు వారీ క్యాలెండర్‌ను ప్రొఫెసర్ రెడ్డి, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ ఆవిష్కరించారు. పర్యావరణ ప్రేమికులంతా ఈ క్యాలెండర్ ఆధారంగా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. ప్రతి విద్యా సంస్థల్లో పలు కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఫా ట్రస్ట్ ప్రతినిధి వి.నర్సింగ్, సెంట్రల్ యూనివర్శిటీ బోటనీ విద్యార్థిని జోష్ణవి, ఏయూ సోషల్ వర్క్ విద్యార్థులు బి.భరద్వాజ్ కుమార్, ఎ.వెంకటరమణ, సీహెచ్ రాజేశ్వరి, ఎ.సూర్యనారాయణ, బి.యామిని, నారాయణరావు, గ్రీన్‌క్లైమేట్ టీం ఎన్జీవో కార్యదర్శి జె.వి. రత్నం, వలంటీర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

హెచ్‌సీకి సీపీ అభినందనలు


సీపీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న రాజేశ్

పెదగంట్యాడ, జనవరి 29: యారాడ బీచ్‌లో ఇటీవల ఒక విదేశీ యువతిపై ముగ్గురు యువకులు దాడి చేసి గాయపరచడమే కాకుండా సెల్ ఫోన్‌ను ఎత్తుకుపోయిన సంగతి తెలిసిందే. అయితే పన్నెండు గంటల్లోనే నిందితులను పట్టుకోవడంతో పాటు సెల్ ఫోన్ రికవరీ చేయడంలో న్యూపోర్టు క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ వారాది రాజేశ్ కీలకంగా వ్యవహరించారు. ఈ మేరకు సీపీ డాక్టర్ రవిశంకర్ సోమవారం తమ కార్యాలయంలో రాజేశ్‌ను అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

జీవీఎంసీ కమిషనర్‌కు బదిలీ?

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మకు త్వరలో బదిలీ అయ్యే అవకాశం ఉందని అధికార వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. 2015 బ్యాచ్‌కు చెందిన సాయికాంత్‌వర్మ పనితీరుపై వైసీపీ పెద్దల్లో సానుకూలభావం ఉంది. దీంతో ఆయనకు అనకాపల్లి జిల్లాకు కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉందని అధికారులతోపాటు వైసీపీ ముఖ్య నేతలు చెబుతున్నారు. ఆయన్ను కలెక్టర్‌గా పంపించే ఉద్దేశం ఉండడం వల్లే 2017 బ్యాచ్‌కు చెందిన జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్‌ను జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా నియమించారని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ముగ్గురు అదనపు కమిషనర్లు ఉండగా, నాలుగో అదనపు కమిషనర్ అవసరం లేదని, ఇప్పుడున్న కమిషనర్‌ను బదిలీ చేస్తే విశ్వనాథన్‌ను ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉంచి పాలన సాగించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశంగా చెబుతున్నారు. కాగా జాయింట్ కలెక్టర్‌గా విశ్వనాథన్ ముక్కుసూటిగా వ్యవహరించడంతోపాటు వైసీపీ పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గలేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. కొన్ని భూములకు సంబంధించిన ఫైళ్లను ఆయన వైసీపీ నేతల సిఫార్సులను పరిగణనలోకి తీసుకోకుండానే వెనక్కి పంపించేశారని, అందువల్లే జాయింట్ కలెక్టర్ పోస్టు నుంచి బదిలీ చేశారని పేర్కొంటున్నారు. ముక్కుసూటి అధికారి అయిన విశ్వనాథన్ జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా ఉంటే అక్కడ కీలకమైన విభాగాలను ఆయనకు అప్పగించే అవకాశం ఉందని, ఫైళ్లు అన్నీ పక్కాగా ఉంటేనే ఆయన ముందుకు పంపిస్తారని, లేనిపక్షంలో ఎవరు చెప్పినా రిమార్కులతో వెనక్కి పంపేస్తారని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

నిజాయితీకి బదిలీ బహుమానం!

... 5వ పేజీ తరువాయి

విశ్వనాథన్ పేరు చేర్చించారని చెబుతున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత 2022 ఏప్రిల్‌లో విశ్వనాథన్ విశాఖ జేసీగా వచ్చారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమైతే ఒకేచోట మూడేళ్లు అంతకంటే ఎక్కువ కాలం పనిచేసిన ఐఏఎస్‌లకు బదిలీ చేయాలి. ఈ లెక్కన విశ్వనాథన్‌ను బదిలీ చేయాల్సిన అవసరం లేదు. దీనికితోడు ఆయన సతీమణి విశ్వాంజలి గైక్వాడ్ విశాఖలో పాస్‌పోర్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. స్పౌజ్ కేటగిరీ కింద విశ్వనాథన్‌కు విశాఖలోనే పోస్టింగ్ చూపాలి. విశ్వనాథన్‌ను పాలక పెద్దలు ఇతర జిల్లాలకు పంపాలని భావించినప్పటికీ...స్పౌజ్ కేటగిరీలో జీవీఎంసీలో అప్రాధాన్యం ఉన్న అడిషనల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. గతంలో ఐఏఎస్ అధికారులు జానకి, తమీమ్ అన్సారి జీవీఎంసీలో అడిషినల్ కమిషనర్లుగా పనిచేశారు. ఈ జాబితాలో విశ్వనాథన్ మూడో వ్యక్తి. ఇదిలావుండగా జేసీ బదిలీ రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశ మైంది. నిబంధనల ప్రకారం...నిజాయితీగా పనిచేసే విశ్వనాథన్‌ను బదిలీ చేయడంపై అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

విద్యుత్ చార్జీలు పెంచబోం

... 5వ పేజీ తరువాయి

చేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుత ధరల నుంచి రూ.17,854.16 కోట్ల ఆదాయం వస్తుందని, ప్రతిపాదిత ధరల ద్వారా రూ.100.44 కోట్లు, ప్రతిపాదిత పర్ కాస్ట్ రికవరీ నుంచి రూ.3,207.27 కోట్లు కలిపి మొత్తం రూ.21,161.86 కోట్లు వస్తుందని అంచనా వేసినట్టు వివరించారు. రాబడి లోటు ఏమీ లేదని స్పష్టంచేశారు.

కొనుగోలు ఖర్చు యూనిట్ రూ.4.69

రాబోయే ఆర్థిక సంవత్సరంలో యూనిట్‌కు విద్యుత్ కొనుగోలు ఖర్చు రూ.4.69గా ఉంటుందని, ప్రసారం, పంపిణీ నష్టాల వ్యయం 49 పైసలు, నెట్ వర్క్ ఖర్చులు రూ.1.63, ఇతర ఖర్చులు 28 పైసలు కలిపి సర్వీసు వ్యయం యూనిట్‌కు రూ.7.09 అవుతుందని వివరించారు. సగటున యూనిట్‌కి రూ.6.01 వస్తుందని, రెండింటి మధ్య తేడా యూనిట్‌కి రూ.1.08 ఉంటుందని అంచనా వేశారు.

కొత్త ఆర్థిక సంవత్సరంలో గృహ వినియోగం 7,741.84 మిలియన్ యూనిట్లు ఉంటుందని, దాని ద్వారా రూ.3,764.76 కోట్లు వస్తుందని అంచనా వేశారు. వాణిజ్యానికి 1,501.26 మి.యూ. ఇవ్వడం ద్వారా రూ.1,534.45 కోట్లు వస్తుందని, పరిశ్రమలకు 494.59 మి.యూ. ఇవ్వడం వల్ల రూ.406.87 కోట్లు వస్తుందని, వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలకు 4,767.55 మి.యూ. ఇస్తే రూ.1,000.71 కోట్లు వస్తాయని, సంస్థాగతంగా 508.32 మి.యూ.కు రూ.384.32 కోట్లు రావచ్చునని మొత్తం చూసుకుంటే ఎల్‌టీ విభాగంలో 15,013.56 మి.యూ.కు రూ.7,091.11 కోట్లు వస్తాయని అంచనాలు చూపించారు. అదే హెచ్‌టీ విభాగంలో అయితే 14,840.50 మి.యూ.కు రూ.10,673.34 కోట్లు వస్తుందని వివరించారు.

విశాఖ రేంజ్ డీఐజీగా విశాల్ గున్ని

... 5వ పేజీ తరువాయి

ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న మణికంఠ చందోల్‌ను నియమించింది. అలాగే డీసీపీ-2గా పనిచేస్తున్న కె.ఆనందరెడ్డిని విజయవాడ లా అండ్ ఆర్డర్ డీసీపీగా బదిలీ చేసి, ఆయన స్థానంలో విజయవాడ డీసీపీగా పనిచేస్తున్న మోక సత్యనారాయణను నియమించింది. జాయింట్ కమిషనర్‌గా వచ్చిన ఫకీరప్ప గతంలో నగర లా అండ్ ఆర్డర్ డీసీపీగా పనిచేశారు. ఎన్నికల ముందు ఫకీరప్పను నగరానికి జాయింట్ పోలీస్ కమిషనర్‌గా నియమించడంపై పోలీసు వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతుంది. ఈ నెలాఖరులోపు బదిలీలు పూర్తిచేయాలన్న ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం పలువురు ఐపీఎస్‌లకు స్థానచలనం కలిగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

ఫిల్మ్ క్లబ్‌లో లుకలుకలు

... 5వ పేజీ తరువాయి

ఎకరాలు రూ.30 కోట్లకు క్లబ్‌కు విక్రయించాలని చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల కాయల వెంకటరెడ్డి లాభపడతారని, ఆయన ఆ చుట్టుపక్కల భూములు అభివృద్ధి చేసుకుంటారని, వారి స్వార్థం కోసం క్లబ్ నిధులు దుర్వినియోగం చేయడానికి మంగళవారం సమావేశంలో నిర్ణయం తీసుకోబోతున్నారని పలువురు సభ్యులు సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. క్లబ్ నగరానికి దగ్గరగా ఉంటే బాగుంటుందని అంతా ఏక కంఠంతో చెబుతున్నా సరే...వైసీపీ నాయకులు వారికి నచ్చినట్టు చేయడానికి యత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు. క్లబ్‌కు ప్రభుత్వం నుంచి భూమి ఇప్పిస్తామని, ఎందుకు ఇప్పించలేదో సమాధానం చెప్పాలని, మార్కెట్ ధరకు కొని క్లబ్ నిధులు చెల్లించాల్సిన అవసరం ఏమిటని ఎక్కువ మంది సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు షాక్

కరెంట్ బిల్లులు ఎక్కువ వచ్చాయని కోత

జగదాంబ కూడలి, జనవరి 29: వైఎస్సార్ చేయూత పథకం మహిళలకు అందిస్తున్న సాయంలో ఈ సారి ప్రభుత్వం మొండిచేయి చూపుతోంది. రెండేళ్లగా వరుసగా అర్హత కలిగిన లబ్ధిదారులపైనా అనర్హత వేటు వేసింది. కొత్తగా ఈ సారి ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలతోపాటు గతంలో పథకం కింద అర్హులైనవారికి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. సోమవారం వైఎస్సార్ చేయూత పథకం అర్హుల జాబితాలు దక్షిణ నియోజకవర్గంలోని పలు సచివాలయాలకు చేరాయి. ఈ జాబితాల్లో చాలావరకు గతంలో అర్హులైన మహిళలను ఈసారి పలు కారణాలతో నాట్ ఎలిజిబుల్‌గా ప్రకటించారు. వలంటీర్లు ఈ విషయం ఆయా వార్డులోని మహిళలకు సమాచారమందించారు. నాట్ ఎలిజిబుల్ (ఎన్ఏ) జాబితాలో అత్యధిక శాతం కరెంట్ వినియోగం 300 యూనిట్లు దాటిందన్న నెపంతో ఈపథకంలో అనర్హుల జాబితాలో చూపుతున్నట్టు సచివాలయం సిబ్బంది స్పష్టంచేస్తున్నారు. నెల వారీ వాడకంలో 30 ,40 యూనిట్ల కరెంట్ వినియోగం అధికంగా వచ్చినవారిని సైతం తొలగించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.గ్రేటర్ 30వ వార్డు సచివాలయం పరిధిలో పలువురు లబోదిబోమంటున్నారు.



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ సింహాచలం

'స్పందన'లో 34 వినతులు స్వీకరణ

గాజువాక, జనవరి 29: గ్రేటర్ గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 34 వినతులు వచ్చాయి. వీటిలో అధికంగా పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని, వీధి లైట్లు వేయాలని, కుక్కలు, పశువుల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని వినతులు అందాయి. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జెడ్సీ సింహాచలం సంబంధింత విభాగాల అధికారులకు సూచించారు.

ఆస్పత్రి వైద్యులు, సిబ్బందికి సత్కారం



వైద్యులు, సిబ్బందిని సత్కరించిన దృశ్యం

అగనంపూడి, జనవరి 28: స్థానిక ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు గణతంత్ర వేడుకల్లో ప్రశంసాపత్రాలు అందుకున్న సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ భారతితో పాటు పలువురు వైద్యులు, సిబ్బందిని సోమవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు దానబాల అప్పలనాయుడు, గొలగాని శ్రీనులు మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది ఉష, కృష్ణమూర్తి, లీలావతి, ప్రత్యూష, హేమలక్ష్మి, ఆస్పత్రి కమిటీ మాజీ చైర్మన్ కె.జగదీశ్, బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ సభలను విజయవంతం చేయండి

గాజువాక, జనవరి 29: గాజువాక నియోజకవర్గంలో ఫిబ్రవరి 3,4,5 తేదీల్లో నిర్వహించనున్న టీడీపీ నిర్వహించనున్న జయహో బీసీ సభలను విజయవంతం చేయవలసిందిగా జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు తమ్మిన విజయకుమార్ కోరారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ సభలను నిర్వహిస్తామని, వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై గళమెత్తుతామన్నారు.

శ్మశానవాటిక పనులు పరిశీలన

అగనంపూడి: స్థానిక శ్మానవాటికలో జీవీఎంసీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట తెలుగు మహిళ వార్డు అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవానీ, టీడీపీ నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, బొబ్బరి సూర్య, గొల్లవిల్లి వెంకటరావు, పూడి సత్యారావు, తదితరులు ఉన్నారు.

ముగిసిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలు

సింధియా, జనవరి 29 : షిప్‌యార్డు మైదానంలో గత నెల 26 నుంచి నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీలు సోమవారంతో ముగిశాయి. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్ 5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, స్పెషల్ ఆఫీసర్ రిజిస్టర్ ప్రమీల ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. విజేతలకు బహుమతులను అందజేశారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లోనూ గెలుపొందాలని క్రీడాకారులకు కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.త్రినాధరావు, ఆర్‌వో శారదరావు, శైలజ, రమణ, నీరజా , దేవుడు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అయలాన్ :** మెలోడి, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), తాతా (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** సంగం, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి)
- **నా సామిరంగ :** శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **ఫైటర్ (హిందీ) :** రమాదేవి, కామేశ్వరి,

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20, టమాటా 21, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 52, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 44, బీరకాయలు 48, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 16, క్యాబేజ్ 18, క్యారెట్ 24, దొండకాయలు 26, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 120, బరబాటి 28, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 68, గోరుచిక్కుడు 38, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 310, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 46 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 56, చిలగడదుంపలు 26 , కంద 54, దేముడు చిక్కుడు 28, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	100
ఫారం ధర	--	120
విత్ స్కిన్	--	210
స్కిన్‌లెస్	--	220

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1 లో..

వృథాగా పోతున్న తాగునీరు


- కొళాయిలకు వాల్వ్‌లు లేకపోవడమే కారణం
- నీరంతా మురుగు కాలువల్లో కలిసిపోతుందని సీతానగరం వాసుల ఆవేదన
- జీవీఎంసీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి



సీతానగరంలో కొళాయి నీరు వృథాగా కాలువలోకి పోతున్న దృశ్యం

పెదగంట్యాడ, జనవరి 27: జీవీఎంసీ 75వ వార్డు పరిధి సీతానగరంలో కొళాయిల నుంచి విడుదల చేస్తున్న తాగునీటిలో అధిక శాతం వృథాగా పోతోంది. దీంతో ప్రజలు తాగేందుకు ఉపయోగపడాల్సిన నీరు వృథాగా పారుతూ మురుగు కాలువల్లో కలిసిపోతోంది. కొళాయి కనెక్షన్లలకు వాల్వులు బిగించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. ఏడాది కాలంగా ఇదే పరిస్థితి నెలకొన్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. పెదగంట్యాడలోని సీతానగరంలో ప్రతి ఇంటికి మునిసిపల్ కొళాయి కనెక్షన్ ఉంది. దీంతో ప్రతిరోజు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం సిబ్బంది తాగునీటిని విడుదల చేస్తే స్థానికులు తమ అవసరాల మేరకు నీటిని పట్టుకుంటున్నారు. ఇళ్లలోని డ్రమ్ములు, కుండీలు, బిందెలు, ప్లాస్టిక్ బకెట్లు... ఇలా అందుబాటులో ఉన్న వాటిలో నీటిని నింపుకుంటున్నారు. అయితే ఆ తర్వాత కొళాయిల నుంచి వచ్చే నీరంతా వృథాగా పారుతూ సమీపంలోని మురుగు కాలువల్లో కలిసిపోతోంది. కాలనీలోని ఏ ఒక్క కొళాయికి వాల్వ్ లేదు. అందువల్ల అందరూ తమకు అవసరమైనంత మేరకు నీటిని పట్టుకున్నాక కొళాయి కట్టే అవకాశం లేకపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. నీటి సరఫరా విభాగం సిబ్బంది ప్లాంట్‌లో తాగునీటి విడుదలను నిలిపివేసిన తర్వాతే నీరు వృథాగా పారడం ఆగుతోంది. గోదావరి నీటిని కేబీఆర్ రిజర్వాయర్‌కు తెచ్చి, అక్కడ శుద్ధి చేసిన తర్వాత కాలనీ వాసుల కోసం కొళాయిల ద్వారా విడుదల చేస్తున్నారు. ఇలా శుద్ధి చేసిన నీరంతా నిరుపయోగంగా మురుగు కాలువల్లో కలిసిపోతుండడంతో స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం



కొళాయిలకు విడుదల చేసిన నీటిలో కొంత భాగం వృథాగా పోతోందని, అందువల్ల కొళాయిలకు వాల్వ్‌లు బిగిస్తే తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉందని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులకు తెలియజేశాం. ఈ విషయాన్ని గాజువాక జోన్ కమిషనర్ దృష్టికి కూడా తీసుకువెళ్లాం. ప్రజలు తాగేందుకు ఉపయోగపడాల్సిన నీరు మురుగు కాలువల్లో కలుస్తుండడం బాధాకరం ఉంది. అధికారులు తక్షణమే స్పందించి నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నాం.

-నమ్మి అప్పారావు, సీతానగరం



వృథాగా పోతున్న తాగునీరు

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం, జనవరి 28: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటకరణ ప్రకియపై కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ విధానాలను కార్మికులంతా తిప్పికొట్టాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,082వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ద్వారానే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యపడుతుందని, అందువల్ల ఉక్కు పోరాటంలో ఉద్యోగులతో పాటు ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, మహిళలు, యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ ద్వంద్వ వైఖరి వల్ల ప్రభుత్వ రంగాలు నిర్వీర్యమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజా సంపదలను కేంద్రం కారుచౌకగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతుందని మండిపడ్డారు. ఇప్పటికైనా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం మొండి వైఖరిని వీడాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పోరాటాలతో ఉక్కును కాపాడుకుంటాం

ఉక్కుటౌన్‌షిప్ : స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఎలాంటి పోరాటాలకైనా తాము సిద్ధమని డీవీఆర్ యూనియన్ అధ్యక్షుడు గల్లా శంకర్ సాయిరాం అన్నారు. సెంట్రల్ స్టోర్స్ జంక్షన్ వద్ద సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. ప్లాంట్ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి, నూకరాజు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అక్కిరెడ్డిపాలెం, జనవరి 29: జీవీఎంసీ 69వ వార్డులో సుమారు రూ.నాలుగున్నర కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. నాతయ్యపాలెంలో రూ.కోటితో కల్యాణ మండపం, రూ.60 లక్షలతో చెరువు ఆధునీకరణ పనులు, రూ.కోటిన్నరతో శ్మశాన వాటిక అభివృద్ధి, హరిజన జగ్గయ్యపాలెం వద్ద రూ.50 లక్షలతో అవుట్‌లెట్ నిర్మాణం, తుంగ్లాంలో రూ.20 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. షీలానగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, వైసీపీ 'గాజువాక' ఇన్‌చార్జి ఉరుకూటి చందు, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు, నాయకులు యువశ్రీ, గోపి, రామాంజనేయులు, చిన సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాగిరెడ్డి

వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

- పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, జనవరి 29 : వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) పిలుపునిచ్చారు. శ్రీహరిపురం వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో సోమవారం పార్టీ శ్రేణులకు ఇంటిగ్రేడ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకునే అంశాలను ప్రతి ఒక్కరు తూచా తప్పకుండా పాటించినట్లయితే, పార్టీ విజయం సునాయాస మవు తుందని తెలిపారు. ప్రజలంతా జగన్ పాలనపై విసిగిపోయి ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. గ్రేటర్ 40, 58 నుంచి 63 వార్డుల కార్పొరేటర్లు, వార్డుల అధ్యక్షులు, జిల్లా నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, కొత్తగా ఏర్పాటు చేసిన మహిళ బూత్ కన్వీనర్లకు ఏడుగురు బృందంతో కూడిన పార్టీ నాయకులు శిక్షణ నందించారు. ఓటర్లను ఎలా ప్రభావితం చేయాలి, ఎన్నికల్లో వైసీపీ ఆగడాలకు అడ్డుకట్ట తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో 63వ వార్డు కార్పొరేటర్ గల్లాచిన్న, మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, సీనియర్ నాయకులు కాకిపోలిరెడ్డి, పూడి భాస్కరరావు, వార్డుల అధ్యక్షులు కోరాడ శ్రీను, మాత శ్రీను, మజ్జి సోమేశ్, మజ్జి మాలినాయుడు, నాయకులు రామ్మోహన్‌నాయుడు, బుద్దా త్రినాద్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ శ్రేణుల శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: స్థానిక పశ్చిమ నియోజకవర్గ కేంద్రపార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ విజయానికిపార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 89, 90, 91, 92, 52, 56, 57 వార్డుల ముఖ్యనేతలు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్ర వైద్యంలో నూతన పోకడలపై అవగాహన అవసరం

వేపగుంట జనవరి 29: ప్రపంచ వ్యాప్తంగా నేత్ర వైద్య చికిత్సలో వస్తున్న అధునాతన పోకడలపై వైద్యులు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని శంకర్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆత్మకూరు కృష్ణకుమార్ అన్నారు. నాయుడుతోటలోని శంకర్‌ఫౌండేషన్‌లో నేత్ర వైద్యంపై ఉత్తరాంధ్ర జిల్లాలోని వైద్యాధికారులు, పారామెడికల్ ఉద్యోగులకు ఒకరోజు వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంటి వైద్యంలో కొత్త పరికరాలు, నూతన విధానాలపై అవగాహనకు ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. ప్రజలకు వైద్యమందించటంలో విశేషంగా కృషి చేసిన అనకాపల్లి డీసీఎమ్ డాక్టర్ జి.వి.రమణకుమార్, పార్వతీపురం డీసీఎమ్ డాక్టర్ ఎ.సుకుమార్, డీసీఎమ్ డాక్టర్ విశ్వేశ్వర నాయుడులను సన్మానించారు. ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆత్మకూరు విజయకుమార్, జీఎం.రాధాకృష్ణ, డాక్టర్ కృష్ణప్రసాద్, నశ్రిన్, కృష్ణ, సువర్ణ డీజీఎమ్ రమేష్ కుమార్ పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న శంకర్ ఫౌండేషన్ ట్రస్టీలు

'స్పందన'కు 3 ఫిర్యాదులు

వేపగుంట: స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 3 ఫిర్యాదులు అందాయి. వీటిలో పాతగోపాలపట్నంలో గొల్లవీధిలో రోడ్డుకు అడ్డంగా ఉన్న కారు తొలగించాలని, శంకర్ ఫౌండేషన్ పరిసరాల్లో మంచినీటి పైపులైన్ సౌకర్యం కల్పించాలని కోరారు. 94వ వార్డు బీసీకాలనీలో డ్రైనేజీ సమస్య తదితర వాటిపై జెడ్సీ మల్లయ్యనాయుడు అర్జీలిచ్చారు.

రహదారిని అభివృద్ధి చేయాలని వినతి

పెందుర్తి రూరల్, జనవరి 29: గ్రేటర్ 95వ వార్డు పరిధి వేపగుంట నాలుగు రోడ్ల కూడలి నుంచి రైల్వే రోడ్డు ఓవర్ బ్రిడ్జి వరకు గల ప్రధాన రహదారిని జీవీఎంసీ నిధులతో పునర్నించాలని కార్పొరేటర్ ముమ్మన దేముడు, వైసీపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో వినతి పత్రం సమర్పించారు. సమస్య అధికారులకు వివరించారు. సుమారు 3 కిలోమీటర్ల పొడవున గల ఈ రహదారి 2006కి ముందు ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఉండేది. ఈ ప్రాంతం జీవీఎంసీలో విలీనం తర్వాత ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారిని పట్టించుకోవడం మానేశారు. గ్రేటర్ అధికారులు రహదారి ఆలనా పాలనా చూడలేదు. దీంతో రహదారిలో ఎక్కడికక్కడ గుంతలు పడి ప్రయాణాలకు అవరోధంగా మారుతోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈస్థితిలో రహదారికి మరమ్మతులైనా చేపట్టాలని కార్పొరేటర్ అధికారులను కోరారు.



జీవీఎంసీ స్పందనలో వినతి పత్రమిస్తున్న కార్పొరేటరు ముమ్మన దేముడు

పారిశ్రామిక ప్రాంతంలో కనుమరుగవుతున్న పచ్చదనం

- ప్రధాన రహదారిలో చెట్ల తొలగింపుతో సమస్యలు

మల్కాపురం, జనవరి 29: పారిశ్రామిక ప్రాంత పరిధి ప్రధాన రహదారిలో సెంటర్ డివైడర్‌లో ఉన్నచెట్లను నరికేస్తుండడంపై స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గత కొంతకాలంగా హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులు పేరిట వందలాది చెట్లను తొలగించారు. పరిశ్రమకు చెందిన భారీ యంత్రాలను తీసుకువచ్చేందుకు అడ్డంకిగా ఉన్నాయంటూ సింధియా నుంచి మల్కాపురం మహాలక్ష్మి థియేటర్ వరకు, అటు గాజువాక డిపో సమీపంలోని సాయి బాబా గుడి నుంచి శ్రీహరిపురం లిఖిత థియేటర్ వరకు సెంటర్ డివైడర్‌లో ఉన్న చెట్లను నరికేశారు. ఫలితంగా కాలుష్యపరమైన ఇబ్బందులు ఈ ప్రాం తంలో తలెత్తున్నాయి. ప్రస్తుతం చలికాలం కావడంతో పరిశ్రమలు విడిచిపెట్టే కాలుష్యం... చెట్లులేకపోవడం నేరుగా జనావాసాలపై వస్తోంది. ఈ మార్గంలో రెండునెలలుగా హెచ్‌పీసీఎల్‌కు భారీ యంత్రాలు తరలింపును నిలిపేసినా, చెట్లను తిరిగి నాటలేదు. ఈ విషయంలో జీవీఎంసీ ప్రత్యేక శ్రద్ధ వహించి పచ్చదనానికి చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



నేలకూలుతున్న డివైడర్‌పై ఉన్న చెట్టు



బోసిపోయి ఉన్న ప్రధాన రహదారి

ఇదేమి చోద్యం!

- ఒకే అభివృద్ధి పనులకు రెండుసార్లు శంకుస్థాపన!
- ఐదురోజుల కింద కార్పొరేటర్.. ఇప్పుడు ఎమ్మెల్యే శిలాఫలకాల ఆవిష్కరణ



97వ వార్డులో తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి, జనవరి 29: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార, విపక్ష పార్టీల ప్రజాప్రతినిధుల మధ్యఆధిపత్య పోరు నెలకొంటోంది. కొద్ది రోజుల్లో ఎన్నికలనోటిఫికేషన్ విడుదల కానుందని తెలియడంతో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు పోటాపోటీగా ఉత్సాహం చూపుతున్నారు. ఈ నేపథ్యంలో తరచూ వివాదాలు చోటుచేసుకుంటున్నారు. ఒకే అభివృద్ధి పనులు ఇరుపార్టీల నేతలు శంకుస్థాపన చేస్తున్నారు. సోమవారం 97వ వార్డు పరిధిలోని వివిధ కాలనీల్లో సుమారు రూ. 2కోట్ల నిధులతో చేపట్టనున్న రోడ్లు, డ్రైన్లు తదితర అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శంకుస్థాపన చేశారు. ఇవే పనులకు గత 24వతేదీన వార్డు టీడీపీ కార్పొరేటర్ సేనాపతి వసంత శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఆ రోజు ముందుగానే కార్పొరేటర్ సేనాపతి వసంత విచ్చేశారు. ఎమ్మెల్యే రాకకు వేచిచూసిన అనంతరం కార్పొరేటర్ అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించి వెళ్లారు. కొంతసేపటికి వచ్చిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఆరా తీశారు. తనకంటే ముందే కార్పొరేటర్ శంకుస్థాపన చేసిన విషయం తెలుసుకుని అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసి వెనుదిరిగారు. అవే పనులకు సోమవారం మరోసారి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. తమ వార్డులో జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఎలా శంకుస్థాపన చేస్తారని టీడీపీ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.



విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఉక్కు డైరెక్టర్ మహంతి

స్టీల్‌ప్లాంట్, కస్టమర్స్ జట్ల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 29: స్టీల్‌ప్లాంట్, కస్టమర్స్ జట్ల మధ్య ఉక్కు స్టేడియంలో సోమవారం ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ జరిగింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కస్టమర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 135 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన స్టీల్‌ప్లాంట్ జట్టు 20 ఓవర్లలో 131 పరుగులు మాత్రమే చేయడంతో పరాజయం పాలైంది. తొలుత మ్యాచ్‌ను ప్రారంభించిన డైరెక్టర్ (కమర్షియల్) డీకే మహంతి మాట్లాడుతూ ఇటువంటి మ్యాచ్‌ల వల్ల సంస్థ, కస్టమర్స్ మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందన్నారు. విజేతగా నిలిచిన జట్టుకు ఆయన ట్రోఫీ అందజేశారు. ఈ మ్యాచ్‌లో పలువురు ఉక్కు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అండర్-17 మహిళా క్రికెట్ జట్టుకు విద్యార్థిని ఎంపిక

అగనంపూడి, జనవరి 28: ఉమ్మడి విశాఖ జిల్లా అండర్-17 క్రికెట్ మహిళా జట్టుకు గొన్నవానిపాలెంలోని ఏబీఎస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని కింతాడ వైష్ణవి ఎంపికైంది. ఏపీ స్కూల్స్ గేమ్స్ సెలక్షన్స్‌లో భాగంగా ఇటీవల నిర్వహించిన ఎంపికల్లో వైష్ణవి మంచి ప్రతిభ కనబరిచింది. నరసారావుపేటలో త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో వైష్ణవి పాల్గొననున్నట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు సాలాపు ఈశ్వరరావు తెలిపారు. వైష్ణవిని పాఠశాల కరస్పాండెంట్ కొండయ్య, ప్రిన్సిపాల్ పద్మజాదీపక్, డైరెక్టర్ దీపక్‌లు అభినందించారు.



కింతాడ వైష్ణవి

జాతీయ కిక్ బాక్సింగ్‌లో విద్యార్థినికి కాంస్య పతకం

శ్రీనగర్, జనవరి 29: ఇటీవల చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో కిక్ బాక్సింగ్‌లో టీఎస్సార్ టీటీకే కళాశాల విద్యార్థిని గులివిందల మానస కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా సోమవారం మానసకు కళాశాల చైర్మన్ తలశిల బలరామకృష్ణ, కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కాంస్య పతకం సాధించిన మానస ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధనరావు, వైస్ ప్రిన్సిపాల్ సుభాషిణి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



మానస

అవార్డులు బాధ్యతను పెంచుతాయి


కూర్మన్నపాలెం, జనవరి 29: అవార్డులు బాధ్యతను పెంచుతాయని, వాటి స్ఫూర్తితో ముందుకు సాగాలని జాతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ అన్నారు. కూర్మన్నపాలెం శిష్టకరణాల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగి సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘ సేవలను అభినందించారు. రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్ పీఎస్ మూర్తి మాట్లాడుతూ అందరి సహకారంతోనే వెటరన్ సేవా అవార్డు తనకు లభించిందన్నారు. పేద, బడుగులకు విద్య, వైద్యపరంగా సేవలందిస్తూ జిల్లాలోని సంఘాలకు కూర్మన్నపాలెం అసోసియేషన్ ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం అవార్డు గ్రహీత మూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు గంగవరం గోపి, డి.సత్యారావు, రవీంద్ర, కృష్ణ, గురునాథరావు, తదితరులు పాల్గొన్నారు.



మూర్తిని సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కొణతాలను కలిసిన జనసేన నాయకులు

మల్కాపురం, జనవరి 29 : జనసేన పార్టీలో చేరిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణను గ్రేటర్ విశాఖ 61వ వార్డు ఆ పార్టీ నాయకులు అనకాపల్లిలో సోమవారం కలిసి సన్మానించారు. ఈసందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ, కొణతాల రామకృష్ణ వంటినేత చేరడంతో పార్టీకి మరింత బలం చేకూరుతుందనిఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో జనసేన, తెలుగుదేశం పార్టీల విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంగ దుర్గాప్రశాంతి, వార్డు అధ్యక్షులు దుంగా దేవన్‌రాజు, వీరమహిళలు నడిగెట్ల శంకరమ్మ, అనురాధ, శంకర్, వంశీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కొణతాలకు పుష్పగుచ్ఛమిస్తున్న పారిశ్రామిక ప్రాంత నాయకులు

'జంతు సంరక్షణ చట్టాలను తెలుసుకోవాలి'

గోపాలపట్నం,జనవరి 29: జంతు సంరక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని గోపాలపట్నం పశువైద్య శాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎ.రవికుమార్ అన్నారు. జంతు సంక్షేమ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు బస్వా బాబూరావు, మేఘన తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పశు వైద్య సంచాలకులు రవికుమార్


కోటవీధి వద్ద పోర్టు కెనాల్‌లో మురుగునీరు


కాలువ వద్ద నిలిచిన మురుగు

పోర్టు కెనాల్ దుర్గంధంతో ఉక్కిరిబిక్కిరి

- కోటవీధి వద్ద నిలిచిన మురుగునీరు, చెత్తాచెదారాలు
- వన్‌టౌన్ పరిధిలో ఆరునెలలుగా నరకయాతన
- దోమలు స్వైర విహారం.. ప్రబలుతున్న వ్యాధులు
- పట్టించుకోని పోర్టు ట్రస్ట్.. జీవీఎంసీ


స్కీమ్ బిల్డింగ్ నివాసితుల ఇళ్ల ఎదుట దుస్థితి..

జగదాంబ కూడలి, జనవరి 29: పోర్టు కెనాల్‌లో మురుగునీటితో పాతనగర ప్రాంత నివాసితులు రోగాల పాలవుతున్నారు. నిత్యం దుర్గంధంతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. పోర్టుకెనాల్‌తో ఆరు నెలలకుపైగా వన్‌టౌన్‌లోని లక్ష్మీటాకీస్, ఫెర్రీ రోడ్డు స్కీం బిల్డింగ్, పోస్టాఫీసు పరిసర ప్రాంతాల్లోని జనాలు నరకయాతన అనుభవిస్తున్నారు. సమస్య పరిష్కరించాల్సిన జీవీఎంసీ, పోర్టు ట్రస్ట్ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్రఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పోర్టు ట్రస్ట్ అధికారులు ఇక్కడఉన్న పెద్ద గొట్టాలకు టింకరింగ్ పనులు చేపడుతుండడంతో కెనాల్‌లో చెత్తాచెదారాలు, పూడిక పేరుకుపోయి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పోర్టు కెనాల్ డ్రైనేజీ ద్వారా కేజీహెచ్ డౌనునుంచి కొబ్బరితోట, జ్ఞానాపురంనుంచి పోర్టుట్రస్ట్ కోట వీధి, ఫెర్రీరోడ్డు నుంచి మురుగు నీటిని సముద్రంలోకి విడిచిపెతున్నారు. పోర్టు కన్వేయర్ బెల్ట్ నుంచి వెంకటేశ్వర స్వామి గుడికివెళ్లేదారిలో పోర్టు కెనాల్ వద్ద పోర్టు ట్రస్ట్ బ్రిడ్జి నిర్మాణ పనులతో మురుగునీరు కోటవీధి వద్ద కాలువల్లో పూడిక పేరుకు పోయింది. నీటి నిల్వలతో దోమల వృద్ధితో నిద్ర కరువవుతోందని పరిసరాల వాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఒకవైపు పోర్టు కాలుష్యం.. మరోపక్క పోర్టు కెనాల్ దుర్గంధంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వ్యాధులు ప్రబలుతున్నాయి. పిల్లలు పరిస్థితి మరింత దారుణంగా మారిందని ఫెర్రీ రోడ్డులో నివాసముంటున్న కుటుంబాలు ఆవేదన చెందుతున్నారు డెంగీ, మలేరియా, శ్వాసకోస వ్యాధులతో ఇబ్బంది ఎదుర్కోవాల్సి వాపోతున్నారు. ఐదారునెలల కిందట భారీ తుఫాన్‌తో పోర్టు కెనాల్ అస్తవ్యస్తంగా మారి ఇళ్లలోకి నీరు రావడంతో పాతపోస్టాఫీసు, ఫెర్రీ రోడ్డు, లక్ష్మీటాకీస్ నివాసితులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ వెంటనే పర్యటించి పోర్టు కెనాల్‌లో పూడికలను తీయించారు. ఈ చెత్తాచెదారాలను రహదారులపైనుంచి ఇప్పటికీ తొలగించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోర్టు కెనాల్ దుర్గంధంనుంచి కాపాడాలంటూ కమిషనర్ సాయికాంత్ వర్మ, కలెక్టర్ మల్లికార్జున, పోర్టు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అంగముత్తులకు పలుమార్లు వినతులు సమర్పించినా పట్టించుకోలేదని స్థానిక టీడీపీ మైనారిటీ నాయకుడు గఫూర్ (లడ్డూ) ఆరోపిస్తున్నారు. పోర్టు కెనాల్ జీవీఎంసీ పరిధిలోకి రాదంటూ సంబంధిత అధికారులు, పోర్టు అధికారులను అడిగితే జీవీఎంసీదే బాధ్యత అంటూ తప్పించుకుంటున్నారని ఆయన వాపోతున్నారు. స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ తుఫాన్ వస్తే తప్ప ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆయన విమర్శించారు. ఇకనైనా తక్షణం అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పరీక్ష పే చర్చా కార్యక్రమం వీక్షణ


ఆర్పీపేట పాఠశాలలో వీక్షిస్తున్న విద్యార్థులు

కంచరపాలెం, జనవరి 29 : పరీక్షా పే చర్చా కార్యక్రమం ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ సందేశాన్ని సోమవారం జీవీఎంసీ పాఠశాలల్లోని విద్యార్థులు వీక్షించారు. ఆర్పీపేట, కంచరపాలెం, కప్పరాడ, మాధవధార తదితర పాఠశాలల్లో ఐఎఫ్‌పీ ప్యానల్స్ ద్వారా ప్రధాని సందేశాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు చూశారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు సన్నద్ధమయ్యేలా విద్యార్థులు తెలుసుకున్నారు. ఆర్పీపేట ఉన్నత పాఠశాల్లో హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశాన్ని వివరించారు. ప్రధాని మోదీ చేసిన 25 సూచనలను తెలిపారు.

వేటూరి గీతాలతో సంగీత విభావరి నేడు

డాబాగార్డెన్స్, జనవరి 29: ప్రముఖ సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి 88వ జయంతి సందర్భంగా ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 30న డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'ఎదలో మోహన లాహిరి' పేరిట వేటూరి విరచిత చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు ఆత్రేయ స్మారక కళాపీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళీ తెలిపారు. ఈ సందర్భంగా సినీ నేపథ్య గాయని గాలిదేవర సాహితీకి వేటూరి యువ గాయని పురస్కారంతో సత్కరిస్తున్నట్లు తెలిపారు. ఇందులో సినీ గాయని సాహితీ, రమేశ్ పట్నాయక్, శంబర జోగారావు, బాల గణేశ్, హారిక శ్రీకాకుళం, హారిక విజయనగరం, లీపికారెడ్డి తదితరులు వేటూరి పాటలను పాడనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సినీ, రాజకీయ , కళా రంగ ప్రముఖులు పాల్గొననున్నట్టు చెప్పారు.

వైసీపీ కేడర్‌లో అసంతృప్తి సెగలు

... 5వ పేజీ తరువాయి

వచ్చిన సదరు కార్యకర్త.. శంబంగి మంచివాడైనప్పటికీ బేబీ నాయనను తట్టుకోలేరని, ఓడిపోయే చాన్స్ ఉందంటూ విశ్లేషించారు. ఇక్కడ నుంచి జడ్పీ చైర్మన్ చిన్న శ్రీనును బరిలోకి దించితే కొంతవరకూ పోటీ ఇచ్చే అవకాశం ఉందని అభిప్రాయ పడ్డారు. ఇలా.. మరికొన్ని నియోజకవర్గాల నుంచి వచ్చిన వైసీపీ కార్యకర్తలు కూడా స్థానిక ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్లలో తమకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదని వాపోయారు. పార్టీ సమావేశాలకు, సభలకు రావడం తప్ప..కనీసం ఇల్లు కూడా పొందలేక పోయామంటూ నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన ఒక కార్యకర్త వాపోయారు. గ్రామ/మండల స్థాయిల్లో స్థానిక నేతల వ్యవహారశైలి వల్లే పార్టీపై వ్యతిరేకత పెరిగిందన్నారు.

షర్మిల ప్రభావంపై చర్చ

సభా ప్రాంగణంలో వైసీపీ కార్యకర్తలు షర్మిల ప్రభావంపైనా చర్చించుకుంటూ కనిపించారు. ఈసారి షర్మిల వల్ల కొంత ఓట్లు నష్టపోతామని కొందరు విశ్లేషించారు. షర్మిల చేస్తున్న తీవ్ర విమర్శలు పార్టీకి దెబ్బేనని ఆందోళన వ్యక్తంచేశారు. షర్మిలకు జగన్ ఏదో ఒక పదవి ఇచ్చేస్తే సరిపోయేదని, అలా చేయకుండా సమస్యను పెంచుకున్నా డంటూ పలువురు కార్యకర్తలు విశ్లేషించారు.

పేదల భూములపై పెద్దల కన్ను

... 5వ పేజీ తరువాయి

గ్రామంలో సుమారు 50 ఎకరాలను వైసీపీకి చెందిన నేత ఒకరు ఇటీవల కొనుగోలు చేశారు. ఆ భూముల్లో కొబ్బరిమొక్కలు నాటారు. రాష్ట్రంలో ప్రముఖుని కోసం ఈ భూములు కొనుగోలు చేసినట్టు తెలిసింది. ఇంకా పొరుగు జిల్లాలో చక్రం తిప్పుతున్న మరో కీలక నేత కూడా గండిగుండంలో డీపట్టా భూములు కొనుగోలు చేశారు. పొరుగు జిల్లా నేతకు ఈ ప్రాంతంలో వైసీపీ నేతలు కొందరు సాయపడ్డారు. గండిగుండంలో సర్వేనంబరు 272 నుంచి 275 వరకూ సుమారు 20 ఎకరాల మేర డీపట్టా భూములు విక్రయాలు జరిగాయి. దీనికి సంబంధించి ఆనందపురంలో రిజిస్ట్రేషన్లు జరిగాయి. పాలవలసలో డీపట్టా భూములను నగరానికి చెందిన వైసీపీ ఇన్‌చార్జి ఒకరు కొనుగోలు చేశారు.

చేతులు మారని డీపట్టా భూముల సర్వే నంబర్లను 22 'ఏ' జాబితా నుంచి జిల్లా అధికారులు తొలగించడంతో రిజిస్ట్రేషన్లు కూడా అవుతున్నాయి. అయితే అధికార పార్టీ నేతలు, కీలక అధికారులు కొనుగోలు చేసిన భూములను మాత్రమే 22 (ఎ) జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆనందపురం, పెందుర్తి, భీమిలి, పద్మనాభం మండలాల్లో సుమారు మూడు వేల ఎకరాల డీపట్టా భూములు చేతులు మారుతున్నాయి. ఇందులో 100 నుంచి 200 ఎకరాలు ఒక కీలక అధికారి తీసుకుంటున్నట్టు తెలిసింది. ఆయనకు అనుకూలంగా రిజిస్ట్రేషన్లకు ఇబ్బంది లేకుండా జిల్లా అధికారులు సహకరిస్తున్నారనే ప్రచారం సాగుతుంది.

నిజాయితీకి బదిలీ బహుమానం!

... 5వ పేజీ తరువాయి

విశ్వనాథన్ పేరు చేర్పించారని చెబుతున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత 2022 ఏప్రిల్‌లో విశ్వనాథన్ విశాఖ జేసీగా వచ్చారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమైతే ఒకేచోట మూడేళ్ల అంతకంటే ఎక్కువ కాలం పనిచేసిన ఐఏఎస్‌లకు బదిలీ చేయాలి. ఈ లెక్కన విశ్వనాథన్‌ను బదిలీ చేయాల్సిన అవసరం లేదు. దీనికితోడు ఆయన సతీమణి విశ్వాంజలి గైక్వాడ్ విశాఖలో పాస్‌పోస్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. స్పౌజ్ కేటగిరీ కింద విశ్వనాథన్‌కు విశాఖలోనే పోస్టింగ్ చూపాలి. విశ్వనాథన్‌ను పాలక పెద్దలు ఇతర జిల్లాలకు పంపాలని భావించినప్పటికీ...స్పౌజ్ కేటగిరీలో జీవీఎంసీలో అప్రాధాన్యం ఉన్న అడిషనల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. గతంలో ఐఏఎస్ అధికారులు జానకి, తమీమ్ అన్సారి జీవీఎంసీలో అడిషినల్ కమిషనర్లుగా పనిచేశారు. ఈ జాబితాలో విశ్వనాథన్ మూడో వ్యక్తి. ఇదిలావుండగా జేసీ బదిలీ రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశ మైంది. నిబంధనల ప్రకారం...నిజాయితీగా పనిచేసే విశ్వనాథన్‌ను బదిలీ చేయడంపై అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

విద్యుత్ చార్జీలు పెంచబోం

... 5వ పేజీ తరువాయి

చేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుత ధరల నుంచి రూ.17,854.16 కోట్ల ఆదాయం వస్తుందని, ప్రతిపాదిత ధరల ద్వారా రూ.100.44 కోట్లు, ప్రతిపాదిత పర్ కాస్ట్ రికవరీ నుంచి రూ.3,207.27 కోట్లు కలిపి మొత్తం రూ.21,161.86 కోట్లు వస్తుందని అంచనా వేసినట్టు వివరించారు. రాబడి లోటు ఏమీ లేదని స్పష్టంచేశారు.

కొనుగోలు ఖర్చు యూనిట్ రూ.4.69

రాబోయే ఆర్థిక సంవత్సరంలో యూనిట్‌కు విద్యుత్ కొనుగోలు ఖర్చు రూ.4.69గా ఉంటుందని, ప్రసారం, పంపిణీ నష్టాల వ్యయం 49 పైసలు, నెట్ వర్క్ ఖర్చులు రూ.1.63, ఇతర ఖర్చులు 28 పైసలు కలిపి సర్వీసు వ్యయం యూనిట్‌కు రూ.7.09 అవుతుందని వివరించారు. సగటున యూనిట్‌కి రూ.6.01 వస్తుందని, రెండింటి మధ్య తేడా యూనిట్‌కి రూ.1.08 ఉంటుందని అంచనా వేశారు.

కొత్త ఆర్థిక సంవత్సరంలో గృహ వినియోగం 7,741.84 మిలియన్ యూనిట్లు ఉంటుందని, దాని ద్వారా రూ.3,764.76 కోట్లు వస్తుందని అంచనా వేశారు. వాణిజ్యానికి 1,501.26 మి.యూ. ఇవ్వడం ద్వారా రూ.1,534.45 కోట్లు వస్తుందని, పరిశ్రమలకు 494.59 మి.యూ. ఇవ్వడం వల్ల రూ.406.87 కోట్లు వస్తుందని, వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలకు 4,767.55 మి.యూ. ఇస్తే రూ.1,000.71 కోట్లు వస్తాయని, సంస్థాగతంగా 508.32 మి.యూ.కు రూ.384.32 కోట్లు రావచ్చునని మొత్తం చూసుకుంటే ఎల్‌టీ విభాగంలో 15,013.56 మి.యూ.కు రూ.7,091.11 కోట్లు వస్తాయని అంచనాలు చూపించారు. అదే హెచ్‌టీ విభాగంలో అయితే 14,840.50 మి.యూ.కు రూ.10,673.34 కోట్లు వస్తుందని వివరించారు.

విశాఖ రేంజ్ డీఐజీగా విశాల్ గున్ని

... 5వ పేజీ తరువాయి

ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న మణికంఠ చందోల్‌ను నియమించింది. అలాగే డీసీపీ-2గా పనిచేస్తున్న కె.ఆనందరెడ్డిని విజయవాడ లా అండ్ ఆర్డర్ డీసీపీగా బదిలీ చేసి, ఆయన స్థానంలో విజయవాడ డీసీపీగా పనిచేస్తున్న మోక సత్యనారాయణను నియమించింది. జాయింట్ కమిషనర్‌గా వచ్చిన ఫకీరప్ప గతంలో నగర లా అండ్ ఆర్డర్ డీసీపీగా పనిచేశారు. ఎన్నికల ముందు ఫకీరప్పను నగరానికి జాయింట్ పోలీస్ కమిషనర్‌గా నియమించడంపై పోలీసు వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతుంది. ఈ నెలాఖరులోపు బదిలీలు పూర్తిచేయాలన్న ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం పలువురు ఐపీఎస్‌లకు స్థానచలనం కలిగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

ఫిల్మ్ క్లబ్‌లో లుకలుకలు

... 5వ పేజీ తరువాయి

ఎకరాలు రూ.30 కోట్లకు క్లబ్‌కు విక్రయించాలని చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల కాయల వెంకటరెడ్డి లాభపడతారని, ఆయన ఆ చుట్టుపక్కల భూములు అభివృద్ధి చేసుకుంటారని, వారి స్వార్థం కోసం క్లబ్ నిధులు దుర్వినియోగం చేయడానికి మంగళవారం సమావేశంలో నిర్ణయం తీసుకోబోతున్నారని పలువురు సభ్యులు సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. క్లబ్ నగరానికి దగ్గరగా ఉంటే బాగుంటుందని అంతా ఏక కంఠంతో చెబుతున్నా సరే...వైసీపీ నాయకులు వారికి నచ్చినట్టు చేయడానికి యత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు. క్లబ్‌కు ప్రభుత్వం నుంచి భూమి ఇప్పిస్తామని, ఎందుకు ఇప్పించలేదో సమాధానం చెప్పాలని, మార్కెట్ ధరకు కొని క్లబ్ నిధులు చెల్లించాల్సిన అవసరం ఏమిటని ఎక్కువ మంది సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు


మహిళలతో మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, జనవరి 29: వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. గ్రేటర్ 45వ వార్డు లక్ష్మీనారాయణపురంలో సోమవారం ఆయన పర్యటించారు. మహిళలు ఆయనకు హారతిచ్చి స్వాగతం పలికారు. ఆ ప్రాంతంలోని ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నట్టు చెప్పారు. తనకు సహకరించాలని కోరారు. ఆయనతో పాటు బీజేపీ వార్డు అధ్యక్షుడు వీరబాబు, మండల అధ్యక్షుడు పూజా ఆశీర్వాదం, నాయకులు కొప్పిశెట్టి శంకరరావు, కేవీ కుమార్ తదితరులు ఉన్నారు.

ఆంధ్రాబ్యాంక్ లోగోతో వెండి నాణెం ఆవిష్కరణ


నాణేం ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు

సీతంపేట, జనవరి 29: ఆంధ్రాబ్యాంక్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య ముఖచిత్రంతోపాటు బ్యాంక్ లోగోతో ముద్రించిన వెండి నాణెంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ డాక్టర్ పట్టాభి భోగరాజు పట్టాభిరామయ్య ఆంధ్రాబ్యాంక్, ఆంధ్రా ఇన్సూరెన్స్ కంపెనీ, కృష్ణా జిల్లా సహకార బ్యాంక్, భాగ్యలక్ష్మి బ్యాంక్‌ల వ్యవస్థాపకులుగా చిరస్మరణీయమైన సేవలందించాలన్నారు. ఈ సందర్భంగా నాణేలను విశ్రాంత ఉద్యోగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జి.వాసుదేవమూర్తి, టి.కామేశ్వరరావు, టి.సింహాచలం, టి.కృష్ణారావు, బి.బాపూజీ, ఆర్‌వి రవికుమార్, కె.కోటేశ్వరరావు, జి.మృత్యుంజయరావు, బి.హరిగోపాల్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు డీవీఎస్‌వై శర్మ

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 29: ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా యూత్ గేమ్స్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో నగరానికి చెందిన ఎల్‌ఐసీ ఉద్యోగి, బ్లూ బ్యాడ్జీ అంపైర్ డాక్టర్ డీవీఎస్‌వై. శర్మ ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ మేరకు శర్మను అంపైర్‌గా నియమిస్తూ భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు అనేక అంతర్జాతీయ, జాతీయ టేబుల్ టెన్నిస్ టోర్నీలకు అంపైర్‌గా వ్యవహరించిన శర్మ..చెన్నైలో జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో కూడా పాల్గొనడంపై ఎల్‌ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదప్రసాద్ దాస్, మేనేజర్ పర్సనల్ భగవాన్ ప్రసాద్, ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు కామేశ్వరి, వరప్రసాద్‌తోపాటు టేబుల్ టెన్నిస్ రాష్ట్ర, జిల్లా సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.


శర్మ



సమావేశంలో పల్లా, కోండ్రు మురళీ తదితరులు


42 వార్డులో నిర్వహించిన శిక్షణలో పార్టీ శ్రేణులు

ఉత్తరాంధ్రలో వైసీపీ సింగిల్ డిజిట్‌కే పరిమితం

- మాజీ మంత్రి కోండ్రు మురళీ మోహన్

మహారాణిపేట, జనవరి 29: తెలుగుదేశం పార్టీలోకి పలు వైసీపీకి చెందిన కార్యకర్తలు చేరారు. సోమవారం టీడీపీ కార్యాలయం లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ ఆధ్వర్యంలో విశాఖలో స్థిరపడిన రాజాం నియోజకవర్గానికి చెందిన 60 కుటుంబాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కొండ్రు మురళీ మాట్లాడుతూ, రాష్ట్రంలో త్వరలో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలా ఆడనుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో వైసీపీనుంచి పలువురు టీడీపీలో చేరుతున్నారన్నారు. వైసీపీ పాలనలో నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ముఖ్యమంత్రి జగన్ రాజధాని పేరిట నాటకాలు ఆడుతూ ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈస్థితిలో రానున్న ఎన్నికలలో ఉత్తరాంధ్ర పరిధిలో ఉన్న 34 నియోజకవర్గాలలో టీడీపీ జండా ఎగురవేస్తామన్నారు. అధికార వైసీపీకి సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని తెలిపారు. పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ టీడీపీపై ప్రజలు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేనలు ఉమ్మడి విజయం ఖాయమన్నారు. ఈ సమావేశంలో సౌత్ గండిబాబ్జీతోపాటు పలువురు నాయకుల కార్యకర్తలు పాల్గొన్నారు.

42వ వార్డులో ఇంటిగ్రేటెడ్ శిక్షణ

అక్కయ్యపాలెం: మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని టీడీపీ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖపట్నం ఆర్గనైజింగ్ సెక్రటరీ అకిరెడ్డి జగదీష్ హాజరయ్యారు. ఇంటిగ్రేటెడ్ ట్రైనర్ గౌస్, వినయ్ బూత్ ప్రెసిడెంట్లకు ఓటర్ వెరిఫికేషన్, భవిష్యత్ గ్యారెంటీ తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కన్నం వెంకటరమణారావు, ముక్కి రామకృష్ణ, నాయకులు శ్రీకృష్ణ, దువ్వి కాశీప్రసాద్, కందుకూరి శ్రీవేణి, బంగారు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థులు హవా


అర్హతసాధించిన విద్యార్థులు పాఠశాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు

మహారాణిపేట, జనవరి 29: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఏపీటీ) ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ సైన్స్ ఒలింపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థులు హవా చాటారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి 45 మంది విద్యార్థులు ఎంపిక కాగా, వీరిలో ఒక్క విశాఖ జోన్ నుంచి 29 మంది శ్రీ చైతన్య స్కూల్‌నుంచి విజయకేతనం ఎగురవేశారు. వీరంతా ఫిబ్రవరిలో ఇండియన్ నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ పాల్గొననున్నారు. అర్హత సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను ఉత్తరాంధ్ర శ్రీచైతన్య సంస్థల ఇన్‌చార్జి ఎంవీ సురేశ్, రీజనల్ ఇన్‌చార్జి ఎండీ అహ్మద్ అలీ, తదితరులు అభినందించారు.

కిరండోల్ రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్

విశాఖపట్నం, జనవరి 29: ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ, కిరండోల్ మధ్య రాకపోకలు సాగించే రైళ్లకు ఫిబ్రవరి రెండో తేదీ నుంచి అదనంగా ఒక విస్టాడోమ్ కోచ్‌ను జత చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ-కిరండోల్ రైలుకు (08551) ఫిబ్రవరి రెండు నుంచి మార్చి 31వ తేదీ వరకు ప్రతి శుక్ర, శని, ఆదివారం, తిరుగు ప్రయాణంలో కిరండోల్-విశాఖ రైలుకు (08552) ఫిబ్రవరి మూడు నుంచి ఏప్రిల్ ఒకటి వరకు ప్రతి శని, ఆది, సోమవారాల్లో ఈ కోచ్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

నేడు మాంసం దుకాణాలకు సెలవు

వెంకోజీపాలెం, జనవరి 29 : మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం జీవీఎంసీ పరిధిలోని మాంసం, చేపల దుకాణాలు మూసివేయాలని కమిషనర్ సాయికాంత్ వర్మ సోమవారం ఓ ప్రకటనలోఆదేశాలు జారీ చేశారు. వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే రూ.500 నుంచి రూ.5000 వరకు జరిమానా విధించడంతో పాటు వ్యాపార లైసెన్సు, పట్టుబడిన మాంసాన్ని సీజ్ చేస్తామని చెప్పారు.

గుంతల పూడ్చివేతకు చర్యలు

జ్ఞానాపురం, జనవరి 29: జీవీఎంసీ 41వ వార్డులో నిరంతర నీటి సరఫరా కోసం తవ్విన గుంతలతో కొద్దిరోజులుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగిపోనున్నాయి. ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీలో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఈ సమస్య లేవనెన్నారు. దీంతో నిధులు మంజూరుకావడంతో సోమవారం నుంచి జ్ఞానాపురం ప్రాంతంలో గుంతల పూడ్చివేతకు చర్యలు చేపట్టారు.ఈ పనులకు వార్డు క్లస్టర్ ఇన్‌చార్జ్ కోడిగుడ్ల శ్రీధర్ పరిశీలించారు. కార్యక్రమంలో వెలంగణిరావు, శ్యామ్‌సుందర్, రమేష్, కళ్యాణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

సీతంపేట, జనవరి 29: గాలి, నీరు, భూమి విషతుల్యం కాకుండా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆంధ్రా యూనివర్శిటీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ప్రొఫెసర్ ఇ.ఉదయ్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గ్రీన్ క్లైమేట్ టీం ఆధ్వర్యంలో ఎన్జీవోలు ముద్రించిన పర్యావరణ పరిరక్షణ రోజు వారీ క్యాలెండర్‌ను ప్రొఫెసర్ రెడ్డి, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ ఆవిష్కరించారు. పర్యావరణ ప్రేమికులంతా ఈ క్యాలెండర్ ఆధారంగా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. ప్రతి విద్యా సంస్థల్లో పలు కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఫా ట్రస్ట్ ప్రతినిధి వి.నర్సింగ్, సెంట్రల్ యూనివర్శిటీ బోటనీ విద్యార్థిని జోష్ణవి, ఏయూ సోషల్ వర్క్ విద్యార్థులు బి.భరద్వాజ్ కుమార్, ఎ.వెంకటరమణ, సీహెచ్ రాజేశ్వరి, ఎ.సూర్యనారాయణ, బి.యామిని, నారాయణరావు, గ్రీన్‌క్లైమేట్ టీం ఎన్జీవో కార్యదర్శి జె.వి. రత్నం, వలంటీర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

హెచ్‌సీకి సీపీ అభినందనలు

పెదగంట్యాడ, జనవరి 29: యారాడ బీచ్‌లో ఇటీవల ఒక విదేశీ యునిపై ముగ్గురు యువకులు దాడి చేసి గాయపరచడమే కాకుండా సెల్ ఫోన్‌ను ఎత్తుకుపోయిన సంగతి తెలిసిందే. అయితే పన్నెండు గంటల్లోనే నిందితులను పట్టుకోవడంతో పాటు సెల్ ఫోన్ రికవరీ చేయడంలో న్యూపోర్టు క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ వారాది రాజేశ్ కీలకంగా వ్యవహరించారు. ఈ మేరకు సీపీ డాక్టర్ రవిశంకర్ సోమవారం తమ కార్యాలయంలో రాజేశ్‌ను అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.


సీపీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న రాజేశ్

జీవీఎంసీ కమిషనర్‌కు బదిలీ?

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మకు త్వరలో బదిలీ అయ్యే అవకాశం ఉందని అధికార వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. 2015 బ్యాచ్‌కు చెందిన సాయికాంత్‌వర్మ పనితీరుపై వైసీపీ పెద్దల్లో సానుకూలభావం ఉంది. దీంతో ఆయనకు అనకాపల్లి జిల్లాకు కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉందని అధికారులతోపాటు వైసీపీ ముఖ్య నేతలు చెబుతున్నారు. ఆయన్ను కలెక్టర్‌గా పంపించే ఉద్దేశం ఉండడం వల్లే 2017 బ్యాచ్‌కు చెందిన జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్‌ను జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా నియమించారని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ముగ్గురు అదనపు కమిషనర్లు ఉండగా, నాలుగో అదనపు కమిషనర్ అవసరం లేదని, ఇప్పుడున్న కమిషనర్‌ను బదిలీ చేస్తే విశ్వనాథన్‌ను ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉంచి పాలన సాగించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశంగా చెబుతున్నారు. కాగా జాయింట్ కలెక్టర్‌గా విశ్వనాథన్ ముక్కుసూటిగా వ్యవహరించడంతోపాటు వైసీపీ పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గలేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. కొన్ని భూములకు సంబంధించిన ఫైళ్లను ఆయన వైసీపీ నేతల సిఫార్సులను పరిగణనలోకి తీసుకోకుండానే వెనక్కి పంపించేశారని, అందువల్లే జాయింట్ కలెక్టర్ పోస్టు నుంచి బదిలీ చేశారని పేర్కొంటున్నారు. ముక్కుసూటి అధికారి అయిన విశ్వనాథన్ జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా ఉంటే అక్కడ కీలకమైన విభాగాలను ఆయనకు అప్పగించే అవకాశం ఉందని, ఫైళ్లు అన్నీ పక్కాగా ఉంటేనే ఆయన ముందుకు పంపిస్తారని, లేనిపక్షంలో ఎవరు చెప్పినా రిమార్కులతో వెనక్కి పంపేస్తారని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు షాక్

కరెంట్ బిల్లులు ఎక్కువ వచ్చాయని కోత

జగదాంబ కూడలి, జనవరి 29: వైఎస్సార్ చేయూత పథకం మహిళలకు అందిస్తున్న సాయంలో ఈ సారి ప్రభుత్వం మొండిచేయి చూపుతోంది. రెండేళ్లుగా వరుసగా అర్హత కలిగిన లబ్ధిదారులపైనా అనర్హత వేటు వేసింది. కొత్తగా ఈ సారి ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలతోపాటు గతంలో పథకం కింద అర్హులైనవారికి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. సోమవారం వైఎస్సార్ చేయూత పథకం అర్హుల జాబితాలు దక్షిణ నియోజకవర్గంలోని పలు సచివాలయాలకు చేరాయి. ఈ జాబితాల్లో చాలావరకు గతంలో అర్హులైన మహిళలను ఈసారి పలు కారణాలతో నాట్ ఎలిజిబుల్‌గా ప్రకటించారు. వలంటీర్లు ఈ విషయం ఆయా వార్డులోని మహిళలకు సమాచారమందించారు. నాట్ ఎలిజిబుల్ (ఎన్ఏ) జాబితాలో అత్యధిక శాతం కరెంట్ వినియోగం 300 యూనిట్లు దాటిందన్న నెపంతో ఈపథకంలో అనర్హుల జాబితాలో చూపుతున్నట్టు సచివాలయం సిబ్బంది స్పష్టంచేస్తున్నారు. నెల వారీ వాడకంలో 30 ,40 యూనిట్ల కరెంట్ వినియోగం అధికంగా వచ్చినవారిని సైతం తొలగించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.గ్రేటర్ 30వ వార్డు సచివాలయం పరిధిలో పలువురు లబోదిబోమంటున్నారు.


కల్యాణం చేస్తున్న అర్చకులు

కమనీయం అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జనవరి 29 : వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా సోమవారం నిత్య కల్యాణం కమనీయంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు వెంకట రమణాచార్యులు ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచరాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఆగమ పాఠశాల విద్యార్థులకు అందని ఉపకార వేతనాలు

సింహాచలం, జనవరి 29 : వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలోని నాద, వేద, ఆగమ పాఠశాల విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తి చేసినా.. ఉపకార వేతనాలు అందడం లేదు. పాఠశాలలో చేరిన వారు నెలకు రూ. వెయ్యి చొప్పున వ్యక్తిగత బ్యాంకు అకౌంట్లలో ప్రతినెలా జమ చేయాలి. జమ చేసిన మొత్తం సొమ్మును చదువు పూర్తయి, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన తరువాత విద్యార్థులకు ఒకేసారి అందజేస్తారు. కానీ 2011 విద్యా సంవత్సరం నుంచి ఇప్పటివరకు విద్యార్థులకు ఉపకార వేతనాలు చెల్లించలేదు. ఈ విషయమై పూర్వ విద్యార్థులు పలుమార్లు దేవస్థానం అధికారులకు విన్నవించినా... ఎవరూ పట్టించుకోవడం లేదు. సోమవారం కొందరు పూర్వ విద్యార్థులు పాఠశాలకు వచ్చి తమ సమస్యపై ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులకు మరోసారి మొరపెట్టుకున్నారు. నేరుగా ఈఓకి తమ సమస్యను విన్నవించాలని ప్రయత్నించినా దిగువ శ్రేణి అధికారులు అనుమతించలేదు. ఇప్పటికైనా ఈఓ స్పందించి సమస్యను పరిష్కరించాలని పూర్వ విద్యార్థులు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఎంవీపీ కాలనీ, జనవరి 29 : ఎంవీపీ కాలనీలోని భాష్యం లిటిల్ ఛాంప్స్ ఆవరణలో సోమవారం క్రీడా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు విన్యాసాలు ప్రదర్శించారు. ముఖ్యంగా ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు 28 రాష్ట్రాలకు సంబంధించి ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సత్తిరాజ్, ఎస్‌ఐ నాయుడు, శిల్ప, మేహనాజ్ పాల్గొన్నారు.

మిందివానిపాలెంలో రక్తదాన శిబిరం

ఆనందపురం, జనవరి 29 : రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాలను కాపాడవచ్చునని, యువత రక్తదానానికి ముందుకు రావాలని విశ్వనాథ ఫార్మాసిటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ పి. ఉమాదేవి అన్నారు. సోమవారం మిందివానిపాలెం సమీపంలో ఉన్న ఆ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటినుంచే సేవా కార్యక్రమాలను అలవర్చుకోవాలని చెప్పారు. అనంతరం గాయత్రి విద్యా పరిషత్ ఆస్పత్రి సిబ్బంది వంద మంది విద్యార్థుల నుంచి రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి టి. సమన్వి, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

ఆరిలోవ, జనవరి 29 : జీవీఎంసీ పరిధిలోని 13 వార్డు శ్రీకాంత్‌నగర్ సమీపంలోని జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో ఆదివారం ఎన్‌టీఆర్ సేవా సమితి,ఎంవీవీఎస్ మూర్తి సేవా ట్రస్టు ఆధ్వరంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వందిమంది రోగులు వివిధ సమస్యలతో బాధపడుతున్నట్టు గుర్తించారు. ఈమేరకు వారికి మెరుగైన వైద్యం చేయడానికి సోమవారం ఆరిలోవ నుంచి మూడు బస్సుల్లో గీతం ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి. ధర్మారావు, సురేష్, మజ్జి రమణి, బాలస్వామి, పాల్గొన్నారు

సినిమా గైడ్

- **అయలాన్ :** మెలోడి, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), తాతా (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** సంగం, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి)
- **నా సామిరంగ :** శ్రీకన్య, శ్రీలీలామహల్, మౌర్య కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **ఫైటర్ (హిందీ) :** రమాదేవి, కామేశ్వరి,

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20,టమాటా 21, వంకాయలు (తెలుపు) 18, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 52, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 44, బీరకాయలు 48, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 16, క్యాబేజ్ 18, క్యారెట్ 24, దొండకాయలు 26, బంగాళా దుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 120, బరబటి 28, ముల్లంగి 18,నిమ్మకాయలు (కిలో) 68, గోరుచిక్కుడు 38, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 310, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 46, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 56, చిలగడదుంపలు 26 , కంద 54, దేముడు చిక్కుడు 28, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	100
ఫారం ధర	--	120
విత్ స్కిన్	--	210
స్కిన్‌లెస్	--	220

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..


కోరాడ సభలో మాట్లాడుతున్న ఎం. శ్రీభరత్


మినీ మేనిఫెస్టో గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

వైసీపీ పాలనలో ప్రజలకు ఇబ్బందులు

- తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీభరత్
- కోరాడలో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

పద్మనాభం, జనవరి 29 : వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్త పాలనతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ విశాఖ పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌చార్జి ఎం. శ్రీభరత్ అన్నారు. సోమవారం కోరాడ గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిపక్ష పార్టీ నాయకుల ఇళ్ల గోడలను కూల్చివేస్తూ విధ్వంస పాలనకు తెరతీసిందని విమర్శించారు. విశాఖలో తమ ప్రభుత్వ హయాంలో యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో సాఫ్ట్‌వేర్ కంపెనీ లులూ మాల్‌ను తీసుకురావడానికి ప్రయత్నిస్తే వారిని భయపెట్టి పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయేలా చేశారన్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని రూ. 12 లక్షల కోట్ల అప్పుల్లో ముంచి ప్రతి వ్యక్తిపై రూ.12 లక్షల అప్పు భారాన్ని మోపారన్నారు. ఇదే ప్రభుత్వం కొనసాగితే ప్రజల భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. చంద్రబాబు పాలనతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భీమిలి అసెంబ్లీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లీలావతి, నాయకులు నందీశ్వరరావు, ప్రసాద్, గంగరాజు, ఎర్నాయుడు,బంగారునాయుడు,అప్పలనాయుడు, శ్రీను, రమణ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం

పెదవాల్తేరు : రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా.. ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్నా- చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. సోమవారం 19వ వార్డు పెద జాలారిపేటలో కార్పొరేటర్ నొల్లి నూకరత్న ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆదర్శ నగర్-1, ఆదర్శనగర్ -2 ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తామన్నారు. జగన్ మరోసారి సీఎం అయితే పేదల బతుకులు మరింత దుర్భరంగా మారుతాయని తెలిపారు. వైసీపీ పాలనలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలు దౌర్జన్యాలు, భూకబ్జాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బైరెడ్డి పోతన్న రెడ్డి, తేడ్డు రాజు, మారిన బాపిరాజు, వార్డు అధ్యక్షుడు గూడ చిరంజీవి, లక్ష్మణ, పోలరావు పాల్గొన్నారు.

నేడు మాంసం దుకాణాలకు సెలవు

వెంకోజీపాలెం, జనవరి 29 : మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం జీవీఎంసీ పరిధిలోని మాంసం, చేపల దుకాణాలు మూసివేయాలని కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే రూ.500 నుంచి రూ.5000 వరకు జరిమానా విధించడంతో పాటు వ్యాపార లైసెన్సు, పట్టుబడిన మాంసాన్ని సీజ్ చేస్తామని చెప్పారు.

అమెరికన్ కార్నర్ పనితీరు ప్రశంసనీయం


రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్‌తో మాట్లాడుతున్న అలెగ్జాండర్

వెంకోజీపాలెం, జనవరి 29 : ఏయూలో ఏర్పాటు చేసిన అమెరికన్ కార్నర్ పనితీరు ప్రశంసనీయమని యూఎస్ కాన్సులేట్ (హైదరాబాద్) పబ్లిక్ అఫైర్స్ అధికారి అలెగ్జాండర్ మెక్‌లారెన్ అన్నారు. సోమవారం ఆయన ఏయూలోని అమెరికన్ కార్నర్‌ను సందర్శించారు. కేంద్రం ఏర్పాటు చేసిన నాటి నుంచి నిర్వహించిన కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్‌తో భేటీ అయ్యారు. అమెరికన్ కార్నర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం విశాఖలో జరిగే మిలాన్ కార్యక్రమంలో అమెరికా దేశ నౌకలు పాల్గొంటాయని, దీనిలో భాగంగా 400 మంది వరకు సెయిలర్స్ విశాఖకు వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు యూఎస్ కాన్సులేట్ మిలిస్సా నందుల, జో క్రిష్టోఫర్ ఉన్నారు.

స్పందనకు ఒకే ఒక వినతి

భీమునిపట్నం, జనవరి 29 : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ఒకే ఒక వినతి అందినట్టు జడ్సీ రాము తెలిపారు.సమస్య పరిష్కారానికి సంబంధిత శాఖాధిపతి ఏసీపీ డి. శ్రీనివాసరావును ఆదేశించామని చెప్పారు.

వర్సిటీల ఉన్నతిలో మేథో హక్కుల పరిరక్షణ కీలకం

వెంకోజీపాలెం, జనవరి 29 : స్టార్టప్ సంస్థలు, విశ్వవిద్యాలయాలకు ఉన్నతిలో మేథో హక్కుల పరిరక్షణ అత్యంత కీలకమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్ అన్నారు. సోమవారం ఏయూలో డీపీఐఐటీ-ఐపీఆర్ చెయిర్ హబ్, ఏయూ, పర్డ్యు వర్సిటీ (యూఎస్ఏ) సంయుక్తంగా ఐపీ అండ్ స్టార్టప్స్ అన్న అంశంపై ఒక రోజు అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టార్టప్ రంగంలో జరిగే ఒక నూతన ఆవిష్కరణ ప్రపంచ గతిని మారుస్తుందన్నారు. పర్డ్యు యూనివర్సిటీ ఎంటర్ ప్యూనర్‌సిప్ ప్రోగ్రాం కన్సల్టెంట్ జూలియాన కెసావన్ మాట్లాడుతూ పర్డ్యు యూనివర్సిటీలో మేథో హక్కుల పరిరక్షణకు అవలంభిస్తున్న విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం, ఎన్‌ఆర్‌డీసీ సీనియర్ రీజినల్ మేనేజర్ డాక్టర్ బీకే సాహు, తదితరులు పాల్గొన్నారు.


సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

నేడు 15వ వార్డులో బీసీ గర్జన

వెంకోజీపాలెం, జనవరి 29 : జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీ ఉక్కు కళావేదికలో మంగళవా రం బీసీ గర్జన సదస్సు నిర్వహించనున్నట్టు టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఉదయం 10 గంటల నుంచి సదస్సు ప్రారంభమవుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోర ధనరెడ్డి, మళ్ల రవికుమార్, సీహెచ్ గోవింద్, వరలక్ష్మి, సోని, వెంకటలక్ష్మి, కె. మహేష్ పాల్గొన్నారు.

నేడు వేటూరి సినీ సంగీత విభావరి

వెంకోజీపాలెం, జనవరి 29 : ప్రముఖ సినీ గేయ రచయిత వేటూరి సుందర రామ్మూర్తి జయంతి సందర్భంగా మంగళవారం సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు ఆత్రేయ స్మారక కళా పీఠం గౌరవాధ్యక్షుడు ఎస్ఎస్ఎన్ రాజు తెలిపారు. సోమవారం ఆయన జేఆర్ నగర్‌లోని సెంచూరియన్ వర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఎన్ రాజుతో కలిసి సంగీత విభావరి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 6 గంటలకు సినీ సంగీత విభావరి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళా సంస్థల ప్రతినిధులు చెన్నా తిరుమలరావు, బాబూరాజ్, వి. ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాల మెస్ తనిఖీ

వెంకోజీపాలెం, జనవరి 29 : ఏయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల మెస్‌ను రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్‌స్టీఫెన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో మెస్‌ను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు.

ఉత్సాహంగా టెన్నిస్ పోటీలు

భీమునిపట్నం, జనవరి 26 : పట్టణంలోని పీవీజీ రాజు మెమోరియల్ గోల్డెన్ జూబ్లీ టెన్నిస్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం డీజే రాజు మెమోరియల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించారు. బీచ్ రోడ్డులో వున్న టెన్నిస్ కోర్టులో ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు రవీంద్రరాజు తన తండ్రి డీజే రాజు జ్ఞాపకార్థం ఈ పోటీలను ఏర్పాటు చేశారు. ఎంపీపీ దంతులూరి వెంకట శివసూర్యనారాయణరాజు పోటీలను ప్రారంభించారు. విన్నర్స్‌గా మైలపల్లి షణ్ముఖరావు, గుగ్గిళ్ళ సతీష్ జట్టు, రన్నర్స్‌గా విజ్జపు వెంకటేష్, తట్టికోట భీమారావు గెలుపొందారు. ఈ కార్యక్రమంలో టెన్నిస్ క్లబ్ సభ్యులు, సీనియరు న్యాయవాది పి. సుందర్‌సింగ్, దంతులూరి దిలీప్‌కుమార్, పాల్గొన్నారు.


యాదవ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు


యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

భీమునిపట్నం (రూరల్), జనవరి 29 : మండలంలోని నగరపాలెంలో గోపాలకృష్ణ యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సోమవారం ఆ గ్రామ శివాలయంలో జరిగిన ఈ ఎన్నికలో మాజీ సర్పంచ్ పల్ల వెంకటరావు అధ్యక్షుడిగా, దువ్వి సురేష్, పల్ల గౌరీశ్వరరావు ఉపాధ్యక్షులుగా, కోరాడ రాము ప్రధాన కార్యదర్శిగా, పూసర్ల రామారావు సహాయ కార్యదర్శిగా, కర్రి వెంకటేశ్వరరావు కోశాధికారిగా ఎన్నికయ్యారు.

ముగిసిన 'ఆడుదాం ఆంధ్రా' నియోజకవర్గ స్థాయి పోటీలు

భీమునిపట్నం, జనవరి 29 : పట్టణంలోని ఫుట్‌బాల్ మైదానంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆర్డీవో ఎస్. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసి వారిని జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బహుమతులు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, జోనల్ కమిషనరు రాము, భీమిలి, ఆనందపురం ఎంపీడీవోలు డా.జానకి, లవరాజు, కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, ఎం. షణ్ముఖరావు, అల్లిపిల్లి నర్సింగరావు, ఎస్. కరుణాకర్‌రెడ్డి, యలమంచిలి సూర్యనారాయణ, ఎంఈవో శివరాణి పాల్గొన్నారు.

ఆసరా చెక్కులు పంపిణీ


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

భీమునిపట్నం, జనవరి 29 : మహిళల ఆర్థికాభివృద్ధి కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పథకం అమలు చేసిందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన పాత బస్టాండ్ సమీపంలోని 3వ వార్డులో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులోని 280 డ్వాక్రా సంఘాల్లో 2936 మంది సభ్యులకు 4వ విడత ఆసరా పథకం కింద రూ.9,61,93,395 కోట్ల అందజేశామన్నారు. అనంతరం లాల్‌బహదూర్‌శాస్త్రి మునిసిపల్ ఆవరణలో రూ.149.40 లక్షల జీవీఎంసీ సాధారణ నిధులతో చేపలమార్కెట్, కూరగాయల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, దౌలపల్లి ఏడుకొండలరావు, వార్డు వైసీపీ ఇన్‌చార్జి మైలపల్లి షణ్ముఖరావు, అల్లిపిల్లి నర్సింగరావు, జోనల్ కమిషనరు రాము, ఏఈ సుమన్, తదితరులు పాల్గొన్నారు.


జలజాక్షిని సత్కరిస్తున్న నిర్వాహకులు

జలజాక్షికి 'సంగీత కళా భారతి' బిరుదు

మద్దిలపాలెం, జనవరి 29 : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో సోమవారం నుంచి త్యాగరాజు ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. వచ్చేనెల 3వ తేదీ వరకు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ప్రముఖ స్థానిక గాత్ర విద్వాంసురాలు ముట్నూరి జలజాక్షికి సంగీత కళాభారతి బిరుదు అందజేశారు. ప్రొఫెసర్ కె. సరస్వతి విద్యార్థి ఏర్పాటు చేసిన ఎండోమెంట్ నిధులపై వచ్చిన వడ్డీ రూ.10 వేలు నగదు, పత్రం, నూతన వస్త్రాలతో ఆమెను సత్కరించారు. అనంతరం ప్రముఖ గాత్ర విద్వాంసురాలు లలిత చంద్రశేఖర్ సారథ్యంలో 90 మంది కళాకారులతో శ్రీరామ నామ దినోత్సవం పేరున అన్ని త్యాగరాజస్వామి కీర్తనలు గానం చేశారు. ఉత్సవాలకు విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (వీఎండీఏ) కో స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ గోపాలరావు పర్యవేక్షిస్తున్నారు. కాగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ నైవేలి సంతానగోపాలం మాట్లాడుతూ త్యాగరాజు గొప్పతనాన్ని వివరించారు. వైజాగ్ రెండవ తిరువాయర్‌గా ఉందని కొనియాడారు. మంగళవారం ఉదయం 7 గంటలకు పూజ, 7.30 గంటలకు తిరువీధి, 8.20 గంటలకు పంచరత్న సేవా, తరువాత కచేరీలు ఉంటాయని కళాభారతి కార్యదర్శి రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో త్యాగరాజ ఆరాధన ఉత్సవాల ట్రస్టు అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం, జనవరి 28 : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటకరణపై కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ విధానాలను కార్మికులంతా తిప్పికొట్టాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ మంత్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,082వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ద్వారానే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యపడుతుందని, ఉక్కు పోరాటంలో ఉద్యోగులతో పాటు ప్రజలు, పలు సంఘాలు, రాజకీయ పార్టీలు, మహిళలు, యువత భాగస్వాములు కావాలన్నారు.

పోరాటాలతో ఉక్కును కాపాడుకుంటాం

ఉక్కుటౌన్‌షిప్ : స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఎలాంటి పోరాటాలకైనా తాము సిద్ధమని డీవీఆర్ యూనియన్ అధ్యక్షుడు గల్లా శంకర్ సాయిరాం అన్నారు. సెంట్రల్ స్టోర్స్ జంక్షన్ వద్ద సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. ప్లాంట్ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు.


పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సందీప్

పవన్, చంద్రబాబు కటౌట్లు కించపరిచేలా ఏర్పాటు చేయడంపై ఫిర్యాదు

భీమునిపట్నం, జనవరి 29 : సంగివలసలో వైసీపీ నిర్వహించిన సిద్ధం సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును కించపరిచేలా కటౌట్లు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ కోరారు. సోమవారం ఆయన ఈవిషయమై భీమిలి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్ధం సభలో పవన్, చంద్రబాబును కించపరిచేలా కటౌట్లు ఏర్పాటు చేయడమే కాకుండా వాటి ముందు బాక్సింగ్ పంచింగ్ కిట్లు ఏర్పాటు చేసి, సభకు వచ్చిన వారితో కటౌట్‌లను పంచింగ్ బ్యాగ్‌లతో కొట్టడంతో పాటు కాళ్లతో తన్నడం వంటివి చేశారన్నారు. అలాగే జనసేన, టీడీపీ కార్యకర్తల్లో గొడవలు జరిగేలా ప్రసంగాలు చేయడం వల్ల ఎన్నికల నిర్వహణపై ప్రజల్లో అభద్రతాభావం నెలకొందని చెప్పారు. అనంతరం పవన్ కల్యాణ్ కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కృష్ణయ్య, ఎస్ఎస్ నాయుడు, పరిమి భువనేశ్వరి, నీలాతి శంకర్‌రెడ్డి, ఎరుసు సూర్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పౌష్టికారం ప్యాకెట్లను పరిశీలిస్తున్న సీతారాం

ఆనందపురం, జనవరి 29 : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. సోమవారం ఆయన గిడిజాలలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల్లో పౌష్టికాహార లోపాలను సరిదిద్దేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ అవగాహన సదస్సులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యంగా సరకుల నాణ్యతపై దృష్టిసారిస్తున్నామన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చైల్డ్ డెవప్మెంట్ ప్రాజెక్ట్ అధికారి ఎం. శ్రీదేవి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతూ పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పద్మావతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పతివాడ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

నేడు బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం

ఎండాడ/సాగర్‌నగర్, జనవరి 29 : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడ దసపల్లా లేఅవుట్ ప్రాంతంలో ఉన్న బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం మంగళవారం జరగనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం వారు ప్రకటన విడుదల చేశారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బృంద చర్చలతో సత్ఫలితాలు


విద్యార్థులతో మాజీ డీజీపీ డాక్టర్ సాంబశివరావు

ఎంవీపీ కాలనీ, జనవరి 29 : విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను అధ్యాపకులతో చర్చించడం ద్వారా మరిన్ని మంచి ఫలితాలను సాధించవచ్చని మాజీ డీజీపీ ఎన్. సాంబశివరావు సూచించారు. ఎంవీపీ కాలనీలోని ఐపీఎం కళాశాలలో సోమవారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు కృషి, పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. అనంతరం ఐఐఎం బెంగుళూరు మాజీ డీన్ డాక్టర్ ఎంఆర్ రావు డిస్రప్టివ్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ అండ్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ అన్న అంశంపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధినేత డాక్టర్ సుంకరి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఆనందపురం, జనవరి 29 : మండలంలోని లొడగలవానిపాలెంలో కొలువుదీరిన అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ నిర్మాణకర్తలు బమ్మిడి సూర్యనారాయణ, ఉమ దంపతులు ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

పద్మనాభం (రూరల్), జనవరి 29 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీ ణులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు వీవీవీ ప్రసాదరావు కోరారు. సోమవారం ఆయన పాండ్రంగి పంచాయతీలోని ఏనుగలపాలెం, మునివానిపాలెం, సామయ్యవలస, కురపల్లి గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. రైతుల సమస్యల పరిష్కా రం కోసం వచ్చేనెల మొదటి వారంలో విజయవాడలో రైతు గర్జన సభ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉప్పాడ అప్పారావు, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, పేర్రాజు, అప్పలరమణ, కృష్ణారావు, సారిక ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి : యూటీఎఫ్

పద్మనాభం (రూరల్), జనవరి 29 : ప్రభుత్వం తక్షణమే సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రతినిధి ఉప్పాడ రాము డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలని, 30 శాతం మధ్యంతర భృతివెంటనే మంజూరు చేయాలన్నారు. అలాగే ప్రాథమిక విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసే జీవో 117ను రద్దు చేయాలన్నారు. ఆయనతో పాటు యూటీఎఫ్ నాయకులు టి. రామకృష్ణ, కె. సన్యాసిరావు ఉన్నారు.

టీడీపీ కార్యకర్తల సమావేశం

పద్మనాభం (రూరల్), జనవరి 29 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని ఆరు అంశాలపై నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించాలని టీడీపీ మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు బొదల పావని కోరారు. సోమవారం ఆమె కొవ్వాడ గ్రామంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాను నిశితంగా పరిశీలించి, లోపాలు ఉన్నట్టయితే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. ఓట్లు లేకపోయినా, మార్పులు, చేర్పులు ఉన్నా.. సరిచేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఎస్. వెంకటరావు, రమణమ్మ, బొదల గౌరీ శంకర్, తాతాజీ. అప్పారావు, సూరిదేముడు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

పద్మనాభం, జనవరి 29 : మండలంలోని విజయానందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు భీమిలి డైట్ లెక్చరర్ త్రినాథరావు సోమవారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ముందుగా ఆయన పాఠశాలలో అమలవుతున్న అభ్యసనాభివృద్ధి కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల భాషా నైపుణ్యాలను పరిశీలించారు. పరీక్షల్లో ఉత్తమ ఫలి తాల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సరిత, ఉపాధ్యాయులు రాజు,రాజేశ్వరి, విజయారావు తదితరులు పాల్గొన్నారు.